31వ వసంతంలోకి

# చురకలు

కరీంనగర్, జగిత్యాల, పెద్దపల్లి, రాజన్న సిరిసిల్లా

శుక్రవారం,సెప్టెంబర్ 11 , 2026 పేజీలు : 8

## కొండగట్టు పనులకు మోక్షం



**చురకలు విలేకరి, మల్యాల , సెప్టెంబర్ 10:** కొండగట్టు శ్రీ ఆంజనేయస్వామి దేవస్థానంలో భక్తుల చిరకాల కోరిక నెరవేరనుంది. నిలిచిపోయిన రూ.35.19 కోట్ల విలువైన దీక్షా విరమణ మండపం, 96 గదుల సత్రం నిర్మాణ పనులకు సీఎం ఎ. రేవంత్‌రెడ్డి గ్రీన్‌సిగ్నల్ ఇచ్చారు. ఈ మేరకు చొప్పదండి ఎమ్మెల్యే, కరీంనగర్ జిల్లా కాంగ్రెస్ అధ్యక్షుడు డా. మేడిపల్లి సత్యం గురువారం సీఎం రేవంత్‌రెడ్డిని కలిసి కొండగట్టు అభివృద్ధి పనులపై ప్రత్యేకంగా విజ్ఞప్తి చేశారు. గతంలో ఆంధ్రప్రదేశ్ ఉప ముఖ్యమంత్రి పవన్‌కల్యాణ్ చొరవతో, తిరుమల తిరుపతి దేవస్థానం (టీటీడీ) సహకారంతో రూ.35.19 కోట్ల నిధులు మంజూరై శంకుస్థాపన జరిగినప్పటికీ, వివిధ -మిగతా 2లో

## నేర నియంత్రణ, శాంతి భద్రతల పరిరక్షణకు కట్టుదిట్టమైన చర్యలు చేపట్టాలి

**• గణేష్ నవరాత్రి ఉత్సవాలు ప్రశాంతంగా జరిగేలా భద్రత ఏర్పాట్లు చేయాలి**

**• జాతీయ మెగా లోక్ ఆదాలత్ పై ప్రజల్లో అవగాహన కల్పించాలి**

**• జగిత్యాల జిల్లా ఎస్పీ అశోక్ కుమార్**




**చురకలు ప్రతినిధి, జగిత్యాల, సెప్టెంబర్ 10 :** సమస్యలను క్షేత్రస్థాయిలో గుర్తించి నేరాల నివారణకు ప్రాధాన్యత ఇస్తూనే, జరిగిన నేరాలను త్వరితగతిన ఛేదించి బాధితులకు న్యాయం అందించే విధంగా పోలీస్ అధికారులు, సిబ్బంది పనిచేయాలని జిల్లా ఎస్పీ అశోక్ కుమార్ సూచించారు. గురువారం జిల్లా పోలీస్ ప్రధాన కార్యాలయంలో నిర్వహించిన నెలవారీ క్రైమ్ మీటింగ్లో డీఎస్పీలు, సీఐలు, ఎస్ఐలు పాల్గొన్నారు. ఈ సందర్భంగా జిల్లా వ్యాప్తంగా నమోదైన నేరాల పరిస్థితి, వాటి దర్యాప్తు పురోగతి, పెండింగ్ కేసులు, చార్జ్ షీట్లు, నేర నియంత్రణ చర్యలు, శాంతిభద్రతల నిర్వహణ, ట్రాఫిక్ అమలు, సైబర్ నేరాలు, మహిళలు, చిన్నారుల భద్రత, గణేష్ నవరాత్రి ఉత్సవాలు తదితర అంశాలపై ఎస్పీ సమగ్రంగా సమీక్ష నిర్వహించారు. ఈ సందర్భంగా ఎస్పీ మాట్లాడుతూ జిల్లాలో నేరాల నియంత్రణ, విచారణా వ్యవస్థను వేగవంతం చేయడం, పెండింగ్ కేసులను త్వరగా పరిష్కరించడం, ప్రతి కేసు విచారణ నాణ్యతతో పాటు సాక్ష్యాధారాల సేకరణపై ప్రత్యేక దృష్టి పెట్టాలని సూచించారు. పెండింగ్ కేసులను ప్రాధాన్యతగా తీసుకొని కోర్టుల్లో కన్విక్షన్ రేటు పెంచేలా కృషి చేయాలన్నారు. మహిళా భద్రత, మత్తుపదార్థాల నివారణ, చోరీలు వంటి అంశాలపై క్షుణ్ణంగా విశ్లేషించారు. ప్రతి స్టేషన్లో విజబుల్ పోలీసింగ్ పెంచాలని, ప్రజలతో సత్సంబంధాలు నెలకొల్పి నమ్మకం పెంచేలా ప్రవర్తించాలని సూచించారు. సైబర్ నేరాలపై ప్రత్యేక దృష్టి సారించాలని, ప్రజల్లో అవగాహన కల్పించడంలో సైబర్ టీములు చురుకుగా పనిచేయాలని సూచించారు. నేర నియంత్రణలో బాగంగా సొసైటీ ఫర్ పబ్లిక్ సేఫ్టీ లో బాగంగా ప్రతి పట్టణంలోని కాలనీల్లో, గ్రామాలలో, సీసీ కెమెరాలు ఏర్పాటు చేసుకునేల ప్రజలకు, వ్యాపారులకు అవగాహన కల్పించాలన్నారు. ముఖ్యంగా పోక్సో, గ్రేవ్, నాన్- గ్రేవ్, ఎస్సీ/ ఎస్టీ అట్రాసిటీ కేసుల దర్యాప్తును వేగవంతం చేసి కోర్టుల్లో చార్జీషిట్లు సకాలంలో దాఖలు చేయాలని సూచించారు. గంజాయి, డ్రగ్స్, ఇతర మత్తు పదార్థాల అక్రమ రవాణా, విక్రయాలపై ప్రత్యేక నిఘా ఉంచాలని ఆదేశించారు. దొంగతనాల నివారణకు ప్రతి సర్కిల్ పరిధిలో ప్రత్యేక బృందాలను ఏర్పాటు చేసి పటిష్ట చర్యలు చేపట్టాలని ఆదేశించారు. గణేష్ ఉత్సవాలు ప్రశాంతంగా జరిగేలా భద్రత ఏర్పాట్లు చేయాలి.

ఈ నెల 14 వ తేదీన ప్రారంభం కానున్న గణేష్ నవరాత్రి ఉత్సవాలకు సంబంధించిన వేడుకలను ప్రజలు శాంతియుతంగా, ప్రణాళిక ప్రకారం జరగాలని, ఎక్కడ ఎలాంటి పొరపాట్లకు తావులేకుండా చూడాలని అధికారులకు సూచించారు. ఎక్కడా శాంతిభద్రతల సమస్య రానివ్వవద్దని, ఈ విషయంలో అందరూ సమిష్టిగా కృషి చేయాలన్నారు. డయల్ 112 కు వచ్చే కాల్స్ ను ప్రత్యేక శ్రద్ధతో పరిగణించాలన్నారు. సీసీటీవీలపై దృష్టి సారించాలన్నారు. విజిబుల్ పోలీసింగ్ కు ప్రాధాన్యత ఇవ్వాలన్నారు. ఆయా పోలీస్ స్టేషన్ పరిధిలో వున్న గణేష్ మండపం నిర్వాహకుల కమిటీ వివరాలు తీసుకోవాలని సూచించారు. వినాయక మండపాల దగ్గర ఎటువంటి సమస్యలు, ఘర్షణలు లేకుండా చర్యలు చేపట్టాలని, సమస్యాత్మక ప్రాంతాలు వుంటే బందోబస్తును పెంచాలని సూచించారు. అవసరమైన ప్రదేశాల్లో ప్రత్యేక పికెట్ ఏర్పాటు చేయాలన్నారు.గణేష్ శోభయాత్రలో ఎలాంటి ఆటంకాలు తలెత్తకుండా నిర్వహించడానికి పటిష్టమైన పోలీసులతో బందోబస్తు, నిమజ్జనోత్సవానికి అవసరమైన స్విమర్స్, నిమజ్జనానికి వినియోగించే క్రేన్స్, లైటింగ్స్, సీసీ టీవీ కెమెరాల ఏర్పాటుపై సంబంధిత శాఖల సమన్వయతో నిమజ్జనాన్ని విజయవంతం చేసేందుకు ముందస్తు ప్రణాళిక సిద్ధం చేయాలని సూచించారు. డి.జే లకు ఎట్టి పరిస్థితుల్లో అనుమతి లేదు.

సోషల్ మీడియా పోస్టులపై ప్రత్యేక నిఘా...

గణేష్ మండపాల వద్మశోభాయాత్రలో నిబంధనలు విరుద్ధంగా డి.జే లు, అధిక శబ్దాలు చేసే సౌండ్ సిస్టంల పై పూర్తి స్థాయిలో నిషేధం ఉందని, నిబంధనలు విరుద్ధంగా ఏర్పాటు చేస్తే డి.జే యజమానులతో పాటు మండపాల నిర్వహకులపై కేసులు నమోదు చేయాలని అధికారులను ఆదేశించారు. శాంతిభద్రతలకు విఘాతం కలిగించే వారిపై ప్రత్యేకంగా ఏర్పాటు చేయాలని, ప్రజా జీవనానికి భంగం కలిగిస్తూ తరచూ గొడవలకు పాల్పడే వారిని సంబంధిత తాసిల్దార్ల ముదు బైండోవర్ చేయాలని సూచించారు. సామాజిక మాధ్యమాల్లో విద్వేషాలు రెచ్చగొట్టే పోస్టులు, శాంతి భద్రతలకు విఘాతం కలిగించే పోస్టులు పెట్టే వారిపై, వాస్తవాలను తెలుసుకోకుండా అట్టి పోస్టులను ఫార్వర్డ్ చేసే వారిపై క్రిమినల్ కేసులు నమోదు చేయాలని సూచించారు. ఈ సందర్భంగా విధి నిర్వహణలో ఉత్తమ ప్రతిభ కనబరిచిన అధికారులకు, సిబ్బందికి ప్రశంసా పత్రాలను అందజేశారు. ఈ సమావేశంలో అదనపు ఎస్పీ చేతన్ నితిన్ ఐపీఎస్, డీఎస్పీ రాములు, ఇన్స్పెక్టర్లు, సుధాకర్, సురేష్ బాబు,లక్ష్మీ నారాయణ, శ్రీనివాస్, కరుణాకర్, రాజ్ కుమార్, రిజర్వ్ ఇన్స్పెక్టర్లు వేణు, సైదులు, ఎస్ఐలు, పోలీసు సిబ్బంది పాల్గొన్నారు.

## గణేష్ నవరాత్రి ఉత్సవాలు వైభవంగా నిర్వహిద్దాం

**• అన్ని శాఖల అధికారులు సమన్వయంతో ఏర్పాట్లు చేయాలి**

**• గణేష్ మండపాల నిర్వాహకులు పోలీసులు, ఎన్ పీడీసీ ఎల్ అధికారుల వద్ద వివరాలు తప్పనిసరిగా నమోదు చేసుకోవాలి**

**• డివిజన్, మండల స్థాయిలో సమన్వయ సమావేశం నిర్వహించాలి కలెక్టర్ గరిమ అగ్రవాల్**

**• వినాయక చవితి నేపథ్యంలో ఎస్పీ మహేష్ బి గితె, వివిధ శాఖల అధికారులతో సమీక్ష**



**చురకలు ప్రతినిధి సిరిసిల్ల, సెప్టెంబర్ -10:** గణేష్ నవరాత్రి ఉత్సవాలు వైభవంగా నిర్వహిద్దామని జిల్లా కలెక్టర్ గరిమ అగ్రవాల్ పేర్కొన్నారు. గణేష్ నవరాత్రి ఉత్సవాల సందర్భంగా చేయాల్సిన ఏర్పాట్లు, తీసుకోవాల్సిన జాగ్రత్తలు తదితర అంశాలపై జిల్లా కలెక్టర్ గరిమ అగ్రవాల్, ఎస్పీ మహేష్ బి గితె, అదనపు కలెక్టర్ గడ్డం నగేష్, ఆయా శాఖల అధికారులతో జిల్లా సమీకృత కార్యాలయాల సముదాయంలో గురువారం సమావేశాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ గరిమ అగ్రవాల్ మాట్లాడుతూ.. వినాయక నవరాత్రి ఉత్సవాలను వైభవంగా నిర్వహించేందుకు అన్ని శాఖల అధికారులు సమన్వయంతో ఏర్పాట్లు చేయాలని ఆదేశించారు.ఈ సందర్భంగా మున్సిపల్, సెస్, మత్స్య, పోలీస్, రవాణా శాఖ, ఆర్ అండ్ బీ, నీటి పారుదల, వైద్య ఆరోగ్య శాఖ, తదితర శాఖల ఆధ్వర్యంలో చేపట్టే ఏర్పాట్లపై చర్చించారు. సిరిసిల్ల, వేములవాడ మున్సిపల్ ఆధ్వర్యంలో వినాయక విగ్రహాల-మిగతా 2లో

## ఫీజు రీయింబర్స్‌మెంట్ బకాయిలపై స్పష్టత



**చురకలు, విలేఖరి, వెల్గటూర్, సెప్టెంబర్ 10 :** రాష్ట్రంలోని విద్యార్థుల ఫీజు రీయింబర్స్‌మెంట్ బకాయిలు, ఆశ్రమ పాఠశాలల్లో పనిచేస్తున్న పండి ట్లు, వ్యాయామ విద్యా ఉపాధ్యాయుల పోస్టుల అప్‌గ్రేడేషన్‌కు సంబంధించిన అంశాలపై సంక్షేమ శాఖ మంత్రి అడ్డూరి లక్ష్మణ్ కుమార్ తెలంగాణ రాష్ట్ర శాసనమండలిలో గురువారం శాసన మండలి సభ్యులు అడిగిన ప్రశ్నలకు స మాధానాలు ఇచ్చారు. శాసనమండలి ప్రశ్నోత్తరాల సమయంలో ఎమ్మెల్సీలు తీన్మార్ మల్లన్న, తక్కెళ్ళపల్లి రవీందర్ రావు సత్యం నెలికంటి లేవనెత్తిన అం శాలకు మంత్రి అడ్లూరి ఈ క్రింది వివరాలనువెల్లడించారు. 2025--26 విద్యా సంవత్సరం వరకు ఎస్సీ, ఎస్టీ, బీసీ, ఈబీసీ, మైనారిటీ, దివ్యాంగ విద్యా ర్థులకు సంబంధించి ఫీజు రీయింబ ర్స్‌మెంట్ బకాయిలు రూ.8,591.62 కోట్లు ఉన్నాయని తెలిపారు.ఫీజు రీయింబర్స్‌మెంట్ నిధులు విడుదల కాకపోవడంతో ప్రైవేటు కళాశాలలు విద్యార్థులకు సర్టిఫికెట్లు జారీ చేయడానికి వారి నుంచి ఫీజులు వసూలు చేస్తున్నాయన్న అంశంపై సభ్యులు అడిగిన ప్రశ్నకు మంత్రి స్పందిస్తూ, అటువంటి పరిస్థితి లేదని స్పష్టం చేశారు. దీంతో అక్రమంగా ఫీజులు వసూలు చేస్తున్న ప్రైవేటు కళాశాలలపై చర్యలకు సంబంధించిన తదుపరి ప్రశ్న ఉత్పన్నం కాదని తెలిపారు. అలాగే ఎమ్మెల్సీలు శ్రీపాల్ రెడ్డి లేవనెత్తినపండిట్లు, పీఈటీల పోస్టుల అప్‌గ్రేడేషన్ ఆశ్రమ పాఠశాలల్లోనిపండిట్లు పీఈటీల పోస్టులను స్కూల్ అసిస్టెంట్లుగా అప్‌గ్రేడ్ చేసే అంశంపై మంత్రి అడ్లూరి. సమాధానం ఇస్తూప్రస్తుతం ప్రభుత్వ పరిశీలనలో ఉందని తెలిపారు. ఈ ప్రతిపాదనపై సాధ్యమైనంత త్వరగా తగిన చర్యలు తీసుకుంటామని స్పష్టం చేశారు.విద్యార్థుల సంక్షేమం, విద్యా రంగానికి సంబంధించిన సమస్యల పరిష్కారంతో పాటు ఆశ్రమ పాఠశాలల్లో పనిచేస్తున్న సిబ్బంది అంశాలపైనా ప్రభుత్వం సానుకూలం గా స్పందిస్తూ చర్యలు తీసుకుంటోం దని మంత్రి అడ్లూరి తెలిపారు.

# జగ్గాసాగర్‌లో సీసీ రోడ్డు పనుల ప్రారంభం



**చురకలు విలేకరి,మెట్‌పల్లి రూరల్, సెప్టెంబర్ 10 :** మెట్‌పల్లి మండలం జగ్గాసాగర్ గ్రామంలో గ్రామ అభివృద్ధిలో భాగంగా సీసీ రోడ్డు నిర్మాణ పనులను సర్పంచ్ పుల్ల సాయిగౌడ్ గురువారం ప్రారంభించారు. ఎన్ఆర్‌జీఎస్ నిధుల నుంచి రూ.4 లక్షల వ్యయంతో మంజూరైన సీసీ రోడ్డు నిర్మాణ పనులకు శంకుస్థాపన చేశారు.ఈ సందర్భంగా సర్పంచ్ పుల్ల సాయిగౌడ్ మాట్లాడుతూ గ్రామంలో మౌలిక వసతుల అభివృద్ధికి ప్రాధాన్యత ఇస్తున్నామని తెలిపారు. గ్రామ అభివృద్ధి కోసం చేపడుతున్న పనులకు ప్రజలందరూ సహకరించాలని కోరారు.ఈ కార్యక్రమంలో పంచాయతీ కార్యదర్శి మమత, ఉపసర్పంచ్ లక్ష్మి చిన్నయ్య, వార్డు సభ్యురాలు ఏళ్ల లక్ష్మి, ముదం నర్సింహులు, గడ్డం రాజారెడ్డి తదితరులు పాల్గొన్నారు.

## యువ మహిళా న్యాయవాదికి నంది పురస్కారం



**చురకలు ప్రతినిధి,నిర్మల్, సెప్టెంబర్, 10 :** నిర్మల్ జిల్లా బార్ అసోసియేషన్‌లో న్యాయవాదిగా విధులు నిర్వహిస్తున్న యువ మహిళా న్యాయవాది మిద్దె వరలక్ష్మి ప్రతిష్ఠాత్మక నంది పురస్కారానికి ఎంపికయ్యారు. గురువారం హనుమకొండలోని జిల్లా పరిషత్ కార్యాలయంలో తెలంగాణ జూనియర్ మహిళా న్యాయవాదుల అసోసియేషన్ మరియు కాళోజీ తెలంగాణ జేఏసీ ఆధ్వర్యంలో నిర్వహించిన కాళోజీ నారాయణరావు జయంతి వార్షికోత్సవ కార్యక్రమంలో 2026 నంది అవార్డుల ప్రదానోత్సవం ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా న్యాయవాద వృత్తిలో అందిస్తున్న సేవలు, సామాజిక బాధ్యతతో కూడిన న్యాయ సేవలను గుర్తిస్తూ నిర్మల్ జిల్లాకు చెందిన యువ మహిళా న్యాయవాది మిద్దె వరలక్ష్మిని తెలంగాణ హైకోర్టు న్యాయమూర్తి జస్టిస్ తంగిరాల మాధవి దేవి చేతుల మీదుగా నంది పురస్కారంతో సత్కరించారు. ఈ సందర్భంగా నిర్మల్ జిల్లా బార్ అసోసియేషన్ అధ్యక్షులు బర్ల.శుభకరన్ తో పాటు పలువురు న్యాయవాదులు మిద్దె. వరలక్ష్మిని అభినందించి, భవిష్యత్తులో మరిన్ని విజయాలు సాధించాలని ఆకాంక్షించారు. ఆమెకు లభించిన ఈ పురస్కారం నిర్మల్ జిల్లా న్యాయవాద వర్గాలకు గర్వకారణమని పేర్కొన్నారు.

## దళితుల ఆత్మగౌరవాన్ని అవమానిస్తే సహించేది లేదు

**చురకలు విలేకరి ఎండపల్లి సెప్టెంబర్ 10 :** దళిత నాయకులు, కాంగ్రెస్ కార్యకర్తలు నిరసన కార్యక్రమానికి వెళ్లిన సందర్భంగా కేసీఆర్ ఫామ్‌హౌస్ పరిసరాలను పసుపు నీళ్లతో శుద్ధి చేయడాన్ని నిరసిస్తూ ఎండపల్లి మండల కాంగ్రెస్ పార్టీ ఆధ్వర్యంలో గురువారం రాజారాంపల్లి గ్రామంలోని వివేకానంద విగ్రహం కూడలి వద్ద నిరసన కార్యక్రమం నిర్వహించారు. కాంగ్రెస్ పార్టీ సీనియర్ నాయకుడు మద్దుల గోపాల్‌రెడ్డి ఆధ్వర్యంలో జరిగిన కార్యక్రమంలో నాయకులు, కార్యకర్తలు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.ఈ సందర్భంగా గోపాల్‌రెడ్డి మాట్లాడుతూ.. దళిత నాయకులు, కాంగ్రెస్ కార్యకర్తలు ప్రజాస్వామ్య పద్ధతిలో నిరసన తెలిపేందుకు వెళితే వారిని అవమానించేలా ఫామ్‌హౌస్‌ను పసుపు నీళ్లతో శుద్ధి చేయడం దళితుల ఆత్మగౌరవాన్ని కించపరిచే చర్య అని అన్నారు. దళితుడైన వ్యక్తిని అసెంబ్లీ స్పీకర్‌గా అంగీకరించలేక ప్రతిపక్ష నాయకుడు అసెంబ్లీకి రావడం లేదని ఆరోపించారు. దళితులపై జరుగుతున్న అవమానాలను మాజీ మంత్రి కొప్పుల ఈశ్వర్ ఖండించకపోవడం బాధాకరమన్నారు.దళితుల ఆత్మగౌరవాన్ని అవమానిస్తే చూస్తూ ఊరుకోబోమని, ప్రజాస్వామ్యంలో నిరసన తెలిపే హక్కును ఎవరూ అడ్డుకోలేరని స్పష్టం చేశారు.దళితులు,పేదలు, అణగారిన వర్గాల గౌరవం కోసం కాంగ్రెస్ పార్టీ అండగా ఉంటుందని నాయకులు పేర్కొన్నారు.కార్యక్రమంలో ఫ్యాక్స్ చైర్మన్ గూడ రాంరెడ్డి,మండల అధ్యక్షుడు గెల్లు చంద్రశేఖర్, ప్రధాన కార్యదర్శి కండికట్ల రాజేష్,సర్పంచుల ఫోరం అధ్యక్షుడు సంగ రమేష్, సర్పంచులు గొల్లపల్లి మల్లేశం,బాలసాని శారద -మల్లేశం,కోడిపల్లి కొమురమ్మ-శ్రీనివాస్, పడిదం లావణ్య-మొగిలి,బెడ్డల ప్రవీణ్ ,కొంగల జగదీశ్వర్‌రెడ్డి, దర్శనాల నరేష్,సింగిరెడ్డి లింగారెడ్డి,గెల్లు శ్రీనివాస్, విజయ్,శ్రవణ్‌రెడ్డి,అరుణ్‌రెడ్డి,గ్రామశాఖ అధ్యక్షులు,నాయకులు పాల్గొన్నారు.

# గణేష్ నవరాత్రి ఉత్సవాలు వైభవంగా నిర్వహిద్దాం

**మొదటి పేజీ తరువాయి...**నిమజ్జనం సందర్భంగా కావాల్సిన క్రేన్స్, జేసీబీలు, విద్యుత్ దీపాలు, నీటి సదుపాయం కల్పించాలని ఆయా కమిషనర్లు ఆదేశించారు. స్టీల్ గ్లాస్ లతో నీటిని ఇవ్వాలని తెలిపారు మండపాల వారీగా మున్సిపల్ సిబ్బందిని నియమించి పారిశుధ్య పనులు చేయించాలని సూచించారు. ప్రతి మండపం వద్ద డస్ట్ బిన్ ఏర్పాటు చేయించాలని తెలిపారు. ఎన్ పీ డీ సీ ఎల్ అధికారులు వినాయక మండపాలు, నిమజ్జనం రోజున విగ్రహాలు వెళ్లే దారిలో విద్యుత్ తీగలు ఎత్తు పెంచి ఇబ్బంది కలగకుండా చూడాలని, సమస్యల పరిష్కారానికి ఒక కంట్రోల్ రూమ్ ఏర్పాటు చేసి, సిబ్బందిని నియమించాలని ఆదేశించారు. మండపాల నిర్వాహకులు ఎన్ పీ డీ సీ ఎల్ అధికారుల వద్ద తమ వివరాలు నమోదు చేసుకోవాలని సూచించారు. మత్స్య శాఖ ఆధ్వర్యంలో సిరిసిల్ల, వేములవాడ మున్సిపల్ పరిధిలో, అలాగే అన్ని గ్రామ పంచాయతీల పరిధిలో జాలర్లను నియమించాలని సూచించారు. వైద్య ఆరోగ్య శాఖ ఆధ్వర్యంలో 24X7 అంబులెన్స్ లు, మందులు, ఫస్ట్ ఎయిడ్ కిట్లు అందుబాటులో పెట్టాలని, సిరిసిల్ల జీజీహెచ్, వేములవాడ ఏరియా ఆస్పత్రిలో వైద్యులు, సిబ్బంది, ఎమర్జెన్సీ కేర్ అందుబాటులో ఉండాలని సూచించారు. పోలీసులు, అగ్ని మాపక శాఖలు అధికారులు సమన్వయంతో ఏర్పాట్లు చేయాలని ఆదేశించారు. జిల్లా రవాణా శాఖ అధికారులు నిమజ్జనం సాఫీగా సాగేలా కావలసిన ఏర్పాట్లు చేసుకోవాలని సూచించారు. వినాయక విగ్రహాలు వెళ్లే రోడ్లకు ఆర్ అండ్ బీ అధికారులు మరమ్మత్తు చేయించాలని, సిరిసిల్ల, వేములవాడ మున్సిపల్ పరిధిలో, ఆయా గ్రామ పంచాయతీల్లో నిమజ్జనం చేసే చోట పారిశుధ్య పనులు చేయించాలని, గడ్డి, ఇతర చెత్తాచెదారం తొలగింపచేయాలని ఆదేశించారు. నీటి వనరుల వద్ద బారికేడింగ్, లైటింగ్, కావలసిన క్రేన్లు ముందస్తుగా సిద్ధం చేసుకోవాలని తెలిపారు. నిమజ్జనం ముగిసిన తర్వాత రెండు నుంచి మూడు రోజుల పాటు అన్ని వార్డులు, గ్రామ పంచాయతీ లలో పారిశుధ్య పనులు పక్కాగా నిర్వహించాలని ఆదేశించారు. సిరిసిల్ల, వేములవాడ డివిజన్, ఆయా మండలాల పరిధిలో ఆర్డీవోలు, తహసీల్దార్లు ఆయా శాఖల అధికారులతో సమన్వయ సమావేశం నిర్వహించాలని, నవరాత్రి ఉత్సవాల నుంచి నిమజ్జనం వరకు చేయాల్సిన ఏర్పాట్లపై చర్చించాలని, క్షేత్రస్థాయిలో పరిశీలించాలని జిల్లా కలెక్టర్ గరిమ అగ్రవాల్ ఆదేశించారు.

నీరు, ఇసుక నిలువ ఉండాలి

జిల్లాలోని అన్ని మండపాల నిర్వాహకులు తప్పనిసరిగా తమ వివరాలను పోలీస్ శాఖ వెబ్ సైట్ లో నమోదు చేయాలని ఎస్పీ మహేష్ బి గితె సూచించారు. నిమజ్జనం రోజున నిర్ణీత సమయానికి విగ్రహాలను తరలించాలని కోరారు. ప్రతి మండపం వద్ద ప్లాస్టిక్ డ్రమ్ముల్లో నీరు, ఇసుక నిలువ ఉంచాలని సూచించారు. పోలీస్ శాఖ వారి https://policeportal.tspolice.gov.in/index.htm వెబ్సైట్ లో వివరాలు నమోదు చేయాలని వివరించారు. రాష్ట్ర ప్రభుత్వం ఆదేశం మేరకు మహిళల రక్షణకు మొదటి ప్రాధాన్యం ఇస్తున్నామని తెలిపారు. వారికి ఎలాంటి ఇబ్బంది ఎదురైనా కఠిన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు.సమావేశంలో అదనపు కలెక్టర్ గడ్డం నగేష్, ఆర్డీవోలు శ్రీధర్ బాబు, కే ఎస్ బీ కుమారి, డీఎస్పీలు నాగేంద్రాచారి, శ్రీనివాసులు, ప్రొబేషనరీ డిప్యూటీ కలెక్టర్ నిఖిత, జిల్లా రవాణా శాఖ అధికారి శ్రీనివాస్, జిల్లా ఎక్సైజ్ శాఖ అధికారి హిమశ్రీ, జిల్లా అగ్నిమాపక శాఖ అధికారి శ్రీనివాస్ రెడ్డి, జిల్లా వైద్యాధికారి ఏంజెలా ఆల్ఫ్రెడ్, ఈఈ పీఆర్ సుదర్శన్ రెడ్డి, నీటి పారుదల శాఖ అధికారి దయాకర్, వేములవాడ మున్సిపల్ కమిషనర్లు ఖదీర్ పాషా, లోకేష్, ఎన్ పీ డీ సీ ఎల్, జిల్లా పంచాయతీ శాఖ, మత్స్య శాఖ అధికారులు, తహసీల్దార్లు మహేష్, జయంత్, కలెక్టరేట్ పర్యవేక్షకులు ప్రవీణ్ తదితరులు పాల్గొన్నారు.

# కొండగట్టు పనులకు మోక్షం

**మొదటి పేజీ తరువాయి...** సాంకేతిక కారణాలతో పనులు నిలిచిపోయిన విషయాన్ని సీఎంకు వివరించారు.

**ఒకేసారి 2,000 మంది దీక్ష విరమణకు అవకాశం**

రూ.35.19 కోట్లతో చేపట్టనున్న పనుల్లో ప్రధానంగా 2,000 మంది భక్తులు ఒకేసారి హనుమాన్ దీక్ష విరమించుకునేలా ఆధునిక వసతులతో దీక్షా విరమణ మండపం నిర్మించనున్నారు. హనుమాన్ మాలాధారులు పెద్ద సంఖ్యలో కొండగట్టుకు తరలివచ్చే సమయంలో ఈ మండపం ఎంతో ఉపయోగకరంగా ఉండనుంది.

96 గదుల సత్రంతో భక్తులకు వసతి

దూర ప్రాంతాల నుంచి కొండగట్టుకు వచ్చే భక్తుల సౌకర్యార్థం 96 గదులతో సత్రం/అతిథి గృహం నిర్మించనున్నారు. ముఖ్యమంత్రి సానుకూలంగా స్పందించి పెండింగ్ పనులకు ఆమోదం తెలిపారని ఎమ్మెల్యే డా. మేడిపల్లి సత్యం తెలిపారు. త్వరలో టెండర్ ప్రక్రియ పూర్తి చేసి నిర్మాణ పనులు ప్రారంభించేందుకు చర్యలు చేపట్టనున్నట్లు పేర్కొన్నారు. కొండగట్టుకు ఏటా లక్షలాది మంది భక్తులు, ముఖ్యంగా హనుమాన్ మాలాధారులు వస్తున్న నేపథ్యంలో ఈ రెండు నిర్మాణాలు పూర్తయితే భక్తులకు వసతి, దీక్ష విరమణకు మెరుగైన సౌకర్యాలు అందుబాటులోకి రానున్నాయి. అభివృద్ధి పనులకు అనుమతి ఇచ్చిన సీఎం రేవంత్‌రెడ్డికి చొప్పదండి నియోజకవర్గ ప్రజలు, కొండగట్టు అంజన్న భక్తుల తరఫున ఎమ్మెల్యే డా. మేడిపల్లి సత్యం కృతజ్ఞతలు తెలిపారు.

# నేడు పోలాల అమావాస్య

**చురకలు విలేకరి ఇబ్రహీంపట్నం : సెప్టెంబర్ (10):** అన్నదాతకు సాగులో తోడుండే మూగజీవాలను కొలిచే పోలాల అమావాస్యను శుక్రవారం జరుపుకోనున్నారు . పూల దండలు, గజ్జెలు, కొత్త కన్నాలతో బసవన్నలకు ముస్తాబు చేసి ప్రత్యేక పూజలు చేసి నైవేద్యాలను సమర్పించారు.ఎద్లతో దేవాలయాల చుట్టూ ప్రదక్షిణలు చేయించి మొక్కులు చెల్లించారు. అనంతరం బసవన్న లను ఆలయాలకు తీసుకెళ్తారు. పల్లెలు పాడిపంటలతో సుభిక్షంగా ఉండేలా చూడాలని దైవాన్ని వేడుకున్నామని రైతులు పేర్కొ న్నారు. వ్యవసాయేతర కుటుంబాల వారు మట్టితో చేసిన ఎద్ల ప్రతిమలను ఇళ్లల్లో ప్రతిష్ఠించి పూజలు చేశారు.గతం లో పండగను ఐదు రోజులపాటు ఘనంగా జరుపుకునే వారమని రైతులు పేర్కొన్నారు.

గతం లో రైతన్నకు పెద్ద పండగా....

సవత్సరం పాటు వ్యవసాయ పనులలో తమకు సాయంగా ఉన్న ఎడ్ల ,పంటల సుభిక్షంగా ఉండాలని కోరుతు రైతులు పోలాల అమావాస్య సందర్భంగా ఉదయం నుండి ఎడ్లను అలంకరించుకోనీ అలాయలలో మెక్కులూ చెల్లించుకోనీ కుంటుబ సమేతంగా ఎడ్లను వేడుకోనీ ప్రత్యేక పిండి వంటలతో సాయంత్రం ఉపావాసం విడిచె సాంప్రదాయం ఉందని రైతులు పేర్కొన్నారు.

కానరాని కాడెద్దులు...

వ్యవసాయ పనులుఖర్చు తక్కువ..సమయం ఆదా ఆదరణ కోల్పోతున్న ఎడ్ల బండ్లు ఒకప్పుడు దుక్కి దున్నలన్నా ,విత్తు విత్తలన్నా , పండించిన పంట ఇంటికి చేరాలన్నా కాడెద్దులు. ఎద్దుల బండి కావాల్సిందే. వ్యవసాయంలో వాటి పాత్ర చాలా కీలకం. ప్రస్తుతం ట్రాక్టర్లు, యంత్ర పరికరాలు అందుబాటులోకి వచ్చాయి. దీంతో కాడెద్దులు ప్రశ్నార్థకంగా మారుతున్నాయి. చూద్దామన్నా కానరాని పరిస్థితి ఏర్పడుతోంది. గ్రామాల్లో ఒకరిద్దరి వద్ద కాడెద్దులు కనబడుతున్నా అవి జ్ఞాపకాలుగా మిగిలిపోతున్నాయి.రైతన్నకు వెన్నుదన్నుగా నిలిచిన ఎద్దులు, బండ్లు నేడు ఉనికిని కోల్పోతున్నాయి.ప్రస్తుతం గ్రామలలో కాడెద్దుల జాడ లేకుండా పోయాయి.

మట్టి ఎద్దులకే పుజలు....

అన్నదాతకు వ్యవసాయ రంగంలో తాము పండిచే పంటలకు చేదోడు వాదోడుగా ఎద్దులు వ్యవసాయం లో సాయం అయ్యె ఎద్దులు నేడు అంతరించి పోవటం తో ప్రతి సంవత్సరం జరిగే పోలాల అమావాస్య కు నేడు ఎద్దులు లేక పోటం తో మట్టితో ఎద్దులను తయారు చేసి ప్రత్యేక పిండి వంటలతో మొక్కులను చెల్లించి పంటల ను రక్షించి లాభాలు రావలని మొక్కులను చెల్లించుకున్నారు.

**పోలాల అమావాస్య వ్రతకథ....**

పూర్వం పిల్లలమఱ్ఱి అనే గ్రామంలో సంతానరామావధానులు అనే స్మార్తపండితుడు ఉండేవాడు. ఆయనకు ఏడుగురు మగపిల్లలు. అందరికీ పెళ్ళిళ్ళయి, కోడళ్ళు కాపురానికి వచ్చారు. పెద్దకోడళ్ళు ఆరుగురికీ పిల్లలు పుట్టారు గానీ, చిన్నకోడలు సుగుణకు మాత్రం పిల్లలు పుట్టడం, వెంటనే చనిపోతూండడం జరిగేది. అలా ఆరుసార్లు జరిగింది. ఆ కారణంగా ఏ కోడలికీ ఆ ఆరు సంవత్సరాలు 'పోలాల అమావాస్య వ్రతం' చేసుకోవడం కుదరలేదు. అందువేత సుగుణంటే వారికి చాలా కోపం. సూటిపోటి మాటలతో బాధించేవారు. ఏడవ సవత్సరం సుగుణ మరోసారి గర్భవతి అయింది.

## విద్యార్థినుల ఆరోగ్యానికి ప్రాధాన్యం

**-పాఠశాలల్లో శానిటరీ నాప్కిన్స్ పంపిణీ**



**చురకలు విలేకరి ఇబ్రహీంపట్నం సెప్టెంబర్ (10) :** విద్యార్థినులు విద్యతో పాటు వ్యక్తిగత పరిశుభ్రత, ఆరోగ్యంపై ప్రత్యేక శ్రద్ధ వహించాలని మండల విద్యాధికారి బండారి మధు సూచించారు. ప్రభుత్వ ఆదేశాల మేరకు మండల పరిధిలోని ప్రభుత్వ ఉన్నత పాఠశాలల్లో 6వ తరగతి నుంచి 12వ తరగతి వరకు చదువుతున్న విద్యార్థినులకు ఇబ్రహీంపట్నం మండల వనరుల కేంద్రం లో ఉచిత శానిటరీ నాప్కిన్స్ పంపిణీ కార్యక్రమం గురువారం నిర్వహించారు. ఈ సందర్భంగా ఎంఈవో మాట్లాడుతూ, రుతుక్రమ సమయంలో విద్యార్థినులు పరిశుభ్రత పాటించడం ఎంతో ముఖ్యమన్నారు. నాణ్యమైన శానిటరీ నాప్కిన్స్ వినియోగించడం ద్వారా అనేక ఆరోగ్య సమస్యలను నివారించవచ్చని తెలిపారు. గ్రామీణ ప్రాంతాల విద్యార్థినుల్లో ఆరోగ్య అవగాహన పెంచడం, పాఠశాల హాజరు మెరుగుపరచడం ఈ కార్యక్రమం లక్ష్యమన్నారు. ప్రభుత్వం విద్యార్థుల ఆరోగ్య పరిరక్షణకు పలు సంక్షేమ కార్యక్రమాలు అమలు చేస్తోందని, వాటిని సద్వినియోగం చేసుకోవాలని సూచించారు. నోడల్ ఉపాధ్యాయులు శానిటరీ నాప్కిన్స్ వినియోగం, సురక్షిత వ్యర్థాల నిర్వహణపై విద్యార్థినులకు తరచూ అవగాహన కల్పించాలని ప్రధానోపాధ్యాయులకు సూచించారు. ఈకార్యక్రమంలో పాఠశాల ప్రధానోపాధ్యాయులు, ఉపాధ్యాయులు తదితరులు పాల్గొన్నారు.

## ఎం.ఎన్.జె.క్యాన్సర్ ఆసుపత్రిలో అన్నదాన సేవ



**చురకలు ప్రతినిధి హైదరాబాద్, సెప్టెంబర్,10 :** తెలంగాణ నాన్ గెజిటెడ్ ఆఫీసర్స్ సెంట్రల్ యూనియన్ (టీఎన్‌జీవోఎస్) ప్రధాన కార్యదర్శి డాక్టర్ ఎస్.ఎం. హుస్సైనీ (ముజీబ్) ఆధ్వర్యంలో, అసద్ అన్వర్ మెమోరియల్ ట్రస్ట్ ద్వారా సేవా కార్యక్రమాలు నిరంతరాయంగా కొనసాగుతున్నాయి. ఇందులో భాగంగా గురువారం ఎం.ఎన్.జె. క్యాన్సర్ ఆసుపత్రిలో చికిత్స పొందుతున్న రోగులతో పాటు వారి సహాయకులకు డాక్టర్ ముజీబ్ స్వయంగా ఆహారాన్ని పంపిణీ చేశారు. తన తల్లిదండ్రులు ఆసదుద్దీన్, అన్వరున్నీసా స్మారకార్థం ఏర్పాటు చేసిన అసద్ అన్వర్ మెమోరియల్ ట్రస్ట్ ద్వారా ప్రతి వారం ఆసుపత్రిలోని రోగులకు భోజన సౌకర్యం కల్పిస్తున్నట్లు డాక్టర్ ముజీబ్ తెలిపారు. చికిత్స కోసం దూర ప్రాంతాల నుంచి హైదరాబాద్‌కు వచ్చి ఆర్థిక ఇబ్బందులు ఎదుర్కొంటున్న రోగులు, వారి సహాయకులకు ఈ అన్నదాన కార్యక్రమం ఎంతో ఆసరాగా నిలుస్తోంది. ఈ కార్యక్రమంలో టీఎన్‌జీవోఎస్ యూనియన్ అసోసియేట్ అధ్యక్షుడు కె.ఆర్. రాజ్‌కుమార్, వైస్ ప్రెసిడెంట్ బోలిగిద్ద శంకర్, ఎం.ఎన్.జె. క్యాన్సర్ ఆసుపత్రి యూనిట్ అధ్యక్షుడు బి. శివకుమార్, కార్యదర్శి చంద్రశేఖర్, హైదరాబాద్ జిల్లా ఏపీఆర్వో మహ్మద్ వహీద్, మహ్మద్ ముస్తఫా, మహ్మద్ హబీబ్ చావుష్ తదితరులు పాల్గొన్నారు. ఈ సందర్భంగా డాక్టర్ ముజీబ్ మాట్లాడుతూ నిస్సహాయ స్థితిలో ఉన్న రోగులకు కడుపునిండా భోజనం అందించడం కంటే గొప్ప తృప్తి మరొకటి లేదన్నారు. సమాజం కోసం కొంతైనా తిరిగి ఇవ్వాలనే ఉద్దేశంతోనే సేవా కార్యక్రమాలను నిర్వహిస్తున్నట్లు తెలిపారు. యూనియన్ నాయకులు, సభ్యులు కూడా ఇలాంటి సేవా కార్యక్రమాల్లో భాగస్వాములు కావడం తనకు మరింత ఉత్సాహాన్ని ఇస్తోందన్నారు. కష్టాల్లో ఉన్న వారికి చేయూతనివ్వడం ప్రతి ఒక్కరి బాధ్యత అని పేర్కొన్నారు. అనంతరం ఎం.ఎన్.జె. క్యాన్సర్ ఆసుపత్రిలో రోగులకు అందుతున్న వైద్య సేవలు, ఇతర సౌకర్యాలపై డాక్టర్ ముజీబ్ ఆరా తీశారు. రోగులకు అవసరమైన సహాయ సహకారాలను యూనియన్ తరఫున అందించేందుకు ఎల్లప్పుడూ సిద్ధంగా ఉంటామని ఆయన హామీ ఇచ్చారు.

# గంగనాల కాలువలో పిచ్చి మొక్కల తొలగింపు

**-అభివృద్ధి కమిటీ ఆధ్వర్యంలో యంత్రాలతో శుభ్రత పనులు**
**-4 వేల ఎకరాలకు సాగునీటి ప్రవాహం మెరుగుపడనున్నది**



**చురకలు విలేకరి ఇబ్రహీంపట్నం సెప్టెంబర్ (10) :** జగిత్యాల జిల్లా ఇబ్రహీంపట్నం మండలం వేములకుర్తి గ్రామ శివారులో గోదావరి నదిపై ఉన్న గంగనాల అయకట్టు మాటు కాలువలో సాగునీటి ప్రవాహానికి అడ్డంకిగా మారిన పిచ్చి మొక్కలు,గడ్డి, చెత్తా చెదారాన్ని రైతులు స్వచ్ఛందంగా తొలగించారు. వేములకుర్తి గ్రామ అభివృద్ధి కమిటీ ఆధ్వర్యంలో యామపూర్,ఫకీర్‌కొండాపూర్ గ్రామాల రైతులు కలిసి ఈ పనులను చేపట్టారు గురువారం గ్రామ అభివృద్ధి కమిటీ చైర్మన్ ఎడిపెల్లి మురళి అధ్యక్షతన నిర్వహించిన సమావేశంలో గంగనాల ఆయకట్టు రైతులకు సాగునీరు సక్రమంగా అందించేందుకు కాలువ శుభ్రత పనులు చేపట్టాలని నిర్ణయించారు. కాలువలో పిచ్చి మొక్కలు, చెత్త పేరుకుపోవడంతో నీటి ప్రవాహం మందగించి రైతులు సాగునీటి సమస్యలను ఎదుర్కొంటున్నారని పేర్కొన్నారు. కాలువ శుభ్రపరిచే విషయమై పలుమార్లు సంబంధిత అధికారులకు వినతిపత్రాలు సమర్పించినప్పటికీ స్పందన లేకపోవడంతో గ్రామ అభివృద్ధి కమిటీ స్వచ్ఛందంగా ముందుకొచ్చి సుమారు రూ.40వేల వ్యయంతో యంత్రాల సహాయంతో శుభ్రత పనులు చేపట్టారు. ఈ కాలువ ద్వారా వేములకుర్తి,యామపూర్,ఫకీర్‌కొండాపూర్ గ్రామాలతో పాటు మల్లాపూర్ మండలంలోని నడికుట, మేగిలిపేట్, ఓబులాపూర్, సంఘెం శ్రీరాంపూర్, దామరాస్‌పల్లి, వాల్గొండ గ్రామాల పరిధిలోని సుమారు 4 వేల ఎకరాల ఆయకట్టుకు సాగునీరు అందుతుంది. కాలువ శుభ్రపరిచిన నేపథ్యంలో నీటి ప్రవాహం మెరుగుపడి రైతులకు సాగునీటి ఇబ్బందులు తొలగడంతో పాటు పంటలకు అవసరమైన నీరు సమృద్ధిగా అందుతుందని రైతులు ఆశాభావం వ్యక్తం చేశారు. ఈ కార్యక్రమంలో నాయకులు సున్నం సత్యం,రైతులు క్యాతం రాజరెడ్డి,కాస రాజేంధర్,కోటేశ్వర్,నందు,రమేష్, నాయిని రాజం,అరె రెవంత్ తదితరులు పాల్గొన్నారు.

# ఆపరేటర్లకు వేతనాలు ఏవి ...?

**-జీతాల కోసం కంప్యూటర్ ఆపరేటర్ల పోరాటం**
**-ఐదు నెలలుగా వేతనాలు లేక ఆర్థిక ఇబ్బందులు**
**-ఎంపీడీఓ సీహెచ్ గణేష్‌కు వినతిపత్రం సమర్పణ**



**చురకలు విలేకరి ఇబ్రహీంపట్నం సెప్టెంబర్ (10) :** జగిత్యాల జిల్లాలోని పంచాయతీ రాజ్ శాఖకు చెందిన ఈ-పంచాయతీ కంప్యూటర్ ఆపరేటర్లు ఐదు నెలలుగా వేతనాలు అందక తీవ్ర ఆర్థిక ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. నెలల తరబడి జీతాలు రాకపోవడంతో కుటుంబ పోషణతో పాటు విధులకు హాజరయ్యేందుకు అవసరమైన ప్రయాణ ఖర్చులు కూడా భరించలేని పరిస్థితి ఏర్పడిందని ఆవేదన వ్యక్తం చేశారు. గురువారం జగిత్యాల జిల్లాలోని అన్ని మండలాలకు చెందిన ఈ-పంచాయతీ కంప్యూటర్ ఆపరేటర్లు సామూహిక సెలవులు చేపట్టి తమ నిరసనను వ్యక్తం చేశారు. ఇబ్రహీంపట్నం మండల కేంద్రంలోని ఎంపీడీఓ కార్యాలయంలో ఎంపీడీఓ సీహెచ్ గణేష్‌కు వినతిపత్రంతో పాటు సామూహిక సెలవు పత్రాలను సమర్పించారు. కంప్యూటర్ ఆపరేటర్లు మాట్లాడుతూ, ఐదు నెలలుగా వేతనాలు అందకపోవడంతో రోజువారీ ఖర్చులు, పిల్లల విద్య, కుటుంబ అవసరాలు తీర్చుకోవడం కష్టసాధ్యంగా మారిందన్నారు. పలుమార్లు ఉన్నతాధికారుల దృష్టికి సమస్యను తీసుకెళ్లినప్పటికీ పరిష్కారం లభించలేదని, అందువల్లే సామూహిక సెలవులకు దిగాల్సి వచ్చిందన్నారు. తక్షణమే పెండింగ్‌లో ఉన్న ఐదు నెలల వేతనాలను విడుదల చేసి, భవిష్యత్తులో జీతాలు సకాలంలో చెల్లించేలా ప్రభుత్వం చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో జిల్లాలోని వివిధ మండలాలకు చెందిన ఈ-పంచాయతీ కంప్యూటర్ ఆపరేటర్లు పాల్గొన్నారు.

# చాకలి ఐలమ్మ పోరాట స్ఫూర్తిని కొనసాగిద్దాం

**-సీపీఐ జిల్లా నేత సుతారి రాములు**



**చురకలు ప్రతినిధి కోరుట్ల, సెప్టెంబర్ 10 :** తెలంగాణ రైతాంగ సాయుధ పోరాటానికి స్ఫూర్తినిచ్చిన వీర వనిత చాకలి ఐలమ్మను నేటి మహిళలు ఆదర్శంగా తీసుకొని ముందుకు సాగాలని సీపీఐ జిల్లా నేత, ఏఐటీయూసీ రాష్ట్ర నాయకుడు సుతారి రాములు పిలుపునిచ్చారు. చాకలి ఐలమ్మ 41వ వర్ధంతి సందర్భంగా గురువారం కోరుట్ల డివిజన్ కేంద్రంలో రజక సంఘం ఆధ్వర్యంలో అఖిలపక్ష పార్టీల నాయకుల సమక్షంలో ఐలమ్మ విగ్రహానికి పూలమాలలు వేసి నివాళు లర్పించారు. అనంతరం నిర్వహించిన సభలో సుతారి రాములు మాట్లాడుతూ.. భూమి కోసం, భుక్తి కోసం, వెట్టి చాకిరీ విముక్తి కోసం ఐలమ్మ సాగించిన పోరాటం చరిత్రలో చిరస్థాయిగా నిలిచిపోయిందన్నారు. ఐలమ్మ కౌలుకు తీసుకున్న భూమిలో పండిన పంటను విసునూరు దొర రామచంద్రారెడ్డి నైజాం సర్కారు అండతో దోచుకునేందుకు ప్రయత్నించగా కమ్యూనిస్టు నాయకుడు భీం రెడ్డి నరసింహారెడ్డి ఆధ్వర్యంలో ఉద్యమం సాగిందన్నారు. ఈ పోరాటం తెలంగాణ రైతాంగ సాయుధ పోరాటానికి స్ఫూర్తిగా నిలిచిందని తెలిపారు. 1947 సెప్టెంబర్ 11 నుంచి 17 వరకు సాగిన తెలంగాణ రైతాంగ సాయుధ పోరాటంలో సుమారు 4,500 మంది అమరులయ్యారని, 3 వేల గ్రామాలు రజాకార్ల నుంచి విముక్తి పొందాయని, 10 లక్షల ఎకరాల భూమిని పేదలకు పంచినట్లు తెలిపారు. ఈ పోరాటానికి రావి నారాయణరెడ్డి, బద్దం ఎల్లారెడ్డి, మఖ్దూం మొహియుద్దీన్ తదితరులు నాయకత్వం వహించారని పేర్కొన్నారు. ఐలమ్మ పోరాట స్ఫూర్తిని నేటి తరానికి అందించాల్సిన బాధ్యత అందరిపై ఉందన్నారు. మహిళలు ఆమెను ఆదర్శంగా తీసుకొని హక్కుల కోసం ఐక్యంగా పోరాడాలని పిలుపునిచ్చారు. కార్యక్రమంలో కోరుట్ల మున్సిపల్ చైర్మన్ తిరుమల వసంత గంగాధర్, కాంగ్రెస్, బీజేపీ కౌన్సిలర్లు, కమ్యూనిస్టు పార్టీ నాయకులు, రజక సంఘం ప్రతినిధులు, కులబాంధవులు తదితరులు పాల్గొని చాకలి ఐలమ్మ విగ్రహానికి పూలమాలలు వేసి ఘనంగా నివాళులర్పించారు.



## సీఐటీయూను మినహాయించడం దుర్మార్గం

**చురకలు విలేకరి,గొల్లపల్లి,సెప్టెంబర్ 10 :** కేంద్ర కనీస వేతన సలహా బోర్డు నుండి సీఐటీయూను మినహాయించడం దుర్మార్గమని సీఐటీయూ జిల్లా ప్రధాన కార్యదర్శి జంగిలి ఎల్లయ్య విమర్శించారు. కేంద్రంలోని మోదీ ప్రభుత్వ కార్మిక వ్యతిరేక విధానాలకు నిరసనగా బుధవారం గొల్లపల్లి మండల కేంద్రం లోని అంబేద్కర్ విగ్రహం వద్ద నిరసన నిర్వహించారు.ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ కార్మికుల కనీసవేతనాలు,జీవన ప్రమాణాలపై నిర్ణయాలు తీసుకునే కీలక బోర్డు పునర్వ్యవస్థీకరణలో సీఐటీయూ,ఏఐటీయూసీ, ఐఎన్టీయూసీ వంటి ప్రధాన కేంద్ర కార్మిక సంఘాలకు ప్రాతినిధ్యం లేకుండా చేయడం అప్రజా స్వామికమని అన్నారు.కార్మిక సంఘాలతో చర్చించకుండా ఏకపక్ష నిర్ణయాలకు మోదీ ప్రభుత్వం మార్గం సుగమం చేస్తోందని ఆరోపించారు.ఈ కార్యక్రమంలో మండల అధ్యక్షుడు జంగిలి ఎల్లయ్య, ప్రధాన కార్యదర్శి శాతల మహేష్, తడగొండ సురేష్, చెలమంది రాజయ్య,గంగస్వామి తదితరులు పాల్గొన్నారు.

## శిక్షణ పొందిన మహిళలకు సర్టిఫికెట్ల పంపిణీ



**చురకలు విలేకరి,బీర్‌పూర్,సెప్టెంబర్ 10 :** బీర్‌పూర్ గ్రామంలో వేసవిలో అలీ ర్యాంప్ ప్రైవేట్ సంస్థ ఆధ్వర్యంలో నిర్వహించిన కుట్టుమిషన్,బ్యూటీషియన్ శిక్షణ పూర్తి చేసుకున్న వారికి సర్టిఫికెట్లు అందజేశారు.70మంది అభ్యర్థులకు రెండు దఫాలుగా 15రోజుల పాటు శిక్షణ ఇచ్చారు. కుట్టుమిషన్‌లో 35 మంది, బ్యూటీషియన్ కోర్సులో 35మంది శిక్షణ పొందారు. కోర్సు కోఆర్డినేటర్లుగా ప్రణీత,సంధ్యారాణి వ్యవహరించారు.బీర్‌పూర్ సర్పంచ్ హరీష్ ఆధ్వర్యంలో సర్టిఫికెట్లు పంపిణీ చేశారు.ఈ కార్యక్రమంలో ఉప సర్పంచ్ జితేందర్, మండల విద్యాధికారి నాగభూషణం,పాఠశాల ప్రధానోపాధ్యాయులు శ్రీనివాస్ రెడ్డి, శిక్షణ పొందిన మహిళలు పాల్గొన్నారు.

## గణేష్ ఉత్సవాలు భక్తిశ్రద్ధలతో జరుపుకోవాలి

**-జగిత్యాల టౌన్ సీఐ కరుణాకర్**




**చురకలు ప్రతినిధి,జగిత్యాల,సెప్టెంబర్ 10 :** రాబోయే గణేష్ ఉత్సవాలను ప్రజా జీవనానికి భంగం కలగకుండా భక్తి శ్రద్ధలతో జరుపుకోవాలని టౌన్ సీఐ కరుణాకర్ సూచించారు.గురువారం ఆయన మాట్లాడుతూ విద్యుత్ తీగలకు దగ్గరగా మండపాలు ఏర్పాటు చేయవద్దని, ట్రాఫిక్‌కు అంతరాయం లేకుండా చూసుకోవాలని, మండపాల్లో భక్తి పాటలు మాత్రమే వేయాలని తెలిపారు.హిందూ సంస్కృతిని ప్రతిబింబించేలా యూత్ పేర్లు పెట్టుకోవాలని, గణేష్ ఆగమన్ కార్యక్రమాలను కూడా ట్రాఫిక్‌కు ఇబ్బంది లేకుండా నిర్వహించాలని కోరారు.జిల్లా ఎస్పీ అశోక్ కుమార్ సూచన మేరకు డీఎస్పీ పురుషోత్తం రెడ్డి ఆధ్వర్యంలో ఈనెల 12న శనివారం దేవిశ్రీగార్డెన్‌లో గణేష్ మండప నిర్వాహకుల సమావేశం ఉంటుందని, నిర్వాహకులు,ఉత్సవ సమితి సభ్యులు హాజరు కావాలని సీఐ తెలిపారు.

## యూనిక్ పోల్ నంబరింగ్‌తో అంతరాయాలపై వేగవంతమైన స్పందన



**చురకలు ప్రతినిధి,జగిత్యాల,సెప్టెంబర్ 10 :** వినియోగదారులకు నాణ్యమైన విద్యుత్ సరఫరా కోసం సాంకేతికతను అందిపుచ్చుకుంటున్నామని జగిత్యాల సర్కిల్ ఎస్ఈ బి.సుదర్శనం తెలిపారు.గురువారం ఆయన మాట్లాడుతూ అసెట్ మ్యాపింగ్ ట్రాకింగ్‌లో భాగంగా 33 కేవీ, 11 కేవీ విద్యుత్ స్తంభాలకు యూనిక్ పోల్ నంబర్లు కేటాయించి పెయింటింగ్ పూర్తి చేశామన్నారు. ఇప్పటివరకు 33 కేవీలో 44, 11 కేవీలో 320 పోల్ నంబరింగ్ పూర్తయిందని వెల్లడించారు. విద్యుత్ లైన్లలో సమస్య వచ్చినప్పుడు యూనిక్ నంబర్ ఆధారంగా లొకేషన్‌ను మ్యాపింగ్ ద్వారా గుర్తించి సిబ్బందిని పంపి త్వరితగతిన పరిష్కరించవచ్చని, దీనివల్ల అంతరాయాల వ్యవధి తగ్గుతుందని పేర్కొన్నారు. లైన్ల నిర్వహణ మరింత క్రమబద్ధంగా, పారదర్శకంగా ఉంటుందని ఎస్ఈ తెలిపారు.

# కళాశ్రీ కాళోజి పురస్కారం ప్రదానం అభినందనీయం

**-జిల్లా గ్రంథాలయ చైర్మన్ సంగన భట్ల దినేష్**




**చురకలు విలేకరి, జగిత్యాల, సెప్టెంబర్ 10 :** ప్రజాకవి, పద్మవిభూషణ్ కాళోజి నారాయణ రావు జయంతి, తెలంగాణ భాషా దినోత్సవ వేడుకలను పురస్కరించుకొని కాళోజి రాష్ట్ర స్థాయి పురస్కారం కార్యక్రమం స్థానిక పెన్షనర్ భవన్ లో కళాశ్రీ ఈశ్వరమ్మ సాహిత్య పీఠం జగిత్యాల అధినేత గుండేటి రాజు ఆధ్వర్యంలో తెలంగాణ ప్రజా చైతన్యానికి మారు పేరు, ప్రజాకవి, పద్మవిభూషణ్ కాళోజి నారాయణ రావు 112వ జయంతి మరియు తెలంగాణ భాషా దినోత్సవ వేడుకలను పురస్కరించుకొని ఆయన చిత్ర పటానికి పూల మాలలు వేసి నివాళులర్పించారు. ఈ సందర్భంగా జిల్లా గ్రంథాలయ చైర్మన్ సంగనభట్ల దినేష్ శర్మ మాట్లాడుతూ అన్యాయాన్నె దిరిస్తే నా గొడవ, అన్యాయం అంతరిస్తే నా గొడవ అంటూ తన కలం, గళంతో సమాజంలో చైతన్యాన్ని రగిలించిన ప్రజాకవి కాళోజీ. తెలంగాణ యాసకు, భాషకు పట్టంగట్టి, సామాన్య ప్రజల గొంతుకగా నిలిచిన మహనీయుడు. ఆయన జయంతి రోజును తెలంగాణ ప్రభుత్వం అధికారికంగా తెలంగాణ భాషా దినోత్సవంగా నిర్వహిస్తోందని అన్నారు. తక్కలపల్లి కి ప్రభుత్వ ఉపాధ్యాయుడు, ఈతబాయి కవితా సంపుటి రచయిత డా. ముత్యం పేట గంగాధర్ కు కాళోజి రాష్ట్ర స్థాయి పురస్కారం అందజేశారు. అనంతరం కాళోజి పై కవులు కవితా గానం వినిపించారు. ఈ కార్యక్రమంలో కళాశ్రీ అధినేత గుండేటి రాజు. ప్రముఖ రచయిత కె.వి. నరేందర్, పెన్షనర్ సంఘ అధ్యక్షుడు కరబూజ రవీందర్ గౌడ్, పోపా అధ్యక్షుడు ఏ వి ఎన్ రాజు, టి.వి.సూర్యం, మల్లికార్జును, అడ్మిన్స్ అయిత అనిత, కటుకం కవిత, లక్కరాజు శ్రీలక్ష్మీ, మద్దెల సరోజన, ఉజగిరి జమున, ములస్థం లావణ్య, సవిత కంకటి, రచన, ఓదెల గంగాధర్, పులి గోవర్ధన్ పాల్గొన్నారు.

# విద్యుత్ కోతలపై రైతుల రాస్తారోకో...

**-కాలిన మోటార్లతో రహదారిపై నిరసన**



**చురకలు విలేకరి, రాయికల్, సెప్టెంబర్ 10 :** రైతులకు ప్రకటించిన విద్యుత్ సరఫరాలో కోతలు విధించడాన్ని నిరసిస్తూ పలు రైతు సంఘాల ఆధ్వర్యంలో రైతులు గురువారం రాయికల్ పట్టణంలో ఆందోళనకు దిగారు. పట్టణంలోని విద్యుత్ ఉపకేంద్రం ఎదుట ఉన్న జగిత్యాల--రాయికల్ ప్రధాన రహదారిపై పెద్ద ఎత్తున బైఠాయించి రాస్తారోకో నిర్వహించారు. దీంతో రహదారిపై వాహనాల రాకపోకలు నిలిచిపోయాయి.విద్యుత్ కోతల కారణంగా వ్యవసాయ మోటార్లు కాలిపోతున్నాయని రైతులు ఆవేదన వ్యక్తం చేశారు. కాలిపోయిన విద్యుత్ మోటార్లను రహదారిపై ప్రదర్శిస్తూ నిరసన తెలిపారు. వ్యవసాయానికి కనీసం 12 గంటలపాటు నాణ్యమైన విద్యుత్ సరఫరా చేయాలని డిమాండ్ చేశారు. విద్యుత్ ఎప్పుడు నిలిచిపోతుందో, ఎప్పుడు పునరుద్ధరిస్తారో రైతులకు ముందస్తు సమాచారం ఇవ్వాలని కోరారు.రైతుల ఆందోళన విషయం తెలుసుకున్న స్థానిక ఎస్సై సుధీర్‌రావు, విద్యుత్ శాఖ జగిత్యాల రూరల్ ఏడీఈ సింధూర శర్మ సంఘటనా స్థలానికి చేరుకుని రైతులతో మాట్లాడారు. వారి సమస్యలను ఉన్నతాధికారుల దృష్టికి తీసుకెళ్లి పరిష్కరించేందుకు చర్యలు తీసుకుంటామని హామీ ఇవ్వడంతో రైతులు ఆందోళన విరమించారు.ఈ నెల 20వ తేదీలోగా సమస్యలను పరిష్కరించాలని రైతులు విద్యుత్ అధికారులను కోరారు. అప్పటిలోగా సమస్యలు పరిష్కారం కాకపోతే రహదారిపై వంటావార్పు తదితర కార్యక్రమాలు చేపట్టి ఆందోళనను ఉధృతం చేస్తామని రైతు సంఘాల నాయకులు హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో రైతులు తదితరులు పాల్గొన్నారు.

# దళితులు నడిచిన రహదారిని శుద్ధి చేయడమా..?

**-కుల వివక్షకు నిదర్శనం**

**-మెట్‌పల్లి కాంగ్రెస్ పట్టణ అధ్యక్షుడు ఎండి రైసుద్దీన్**



**చురకలు ప్రతినిధి కోరుట్ల, సెప్టెంబర్ 10 :** దళితులు నడిచిన ప్రజా రహదారిని 'మైలైంది.. అపవిత్రమైంది' అనే భావనతో పసుపు నీటితో శుద్ధి చేసినట్లు సోషల్ మీడియా లో ప్రచారంలోకి వచ్చిన వీడియోలు, ఫొటోలపై మెట్‌పల్లి పట్టణ కాంగ్రెస్ పార్టీ తీవ్రంగా స్పందించింది. ఈ ఘటన కులవివక్ష, అంటరానిత నానికి నిదర్శనమని పట్టణ కాంగ్రెస్ అధ్యక్షుడు ఎండి రైసుద్దీన్ తీవ్రంగా ఖండించారు. ఈ నెల 7న ఎర్రవెల్లిలో మాజీ ముఖ్యమంత్రి కె. చంద్రశేఖర్ రావు ఫామ్‌హౌస్ వైపు షెడ్యూల్డ్ కాస్ట్ (దళిత) సామాజిక వర్గానికి చెందిన పలువురు శాంతియుతంగా నిరసన కార్యక్రమం నిర్వహించారు.అనంతరం దళితులు నడిచిన ప్రజా రహదారి,పరిసర ప్రాంతాన్ని కొంతమంది వ్యక్తులు పసుపు నీటితో శుద్ధి చేసినట్లు వీడియోలు,ఫొటోలు సోషల్ మీడియాలో వైరల్‌గా మారిన విషయం తెలిసిందే.ఈ సందర్భంగా కాంగ్రెస్ నాయకులు మాట్లాడుతూ ప్రజలందరూ సమానులేనని,కులం,మతం,వర్గం ఆధారంగా ఎలాంటి వివక్షకు తావులేదని అన్నారు.భారత రాజ్యాంగం ప్రతి పౌరుడికి సమానత్వం, మానవ గౌరవాన్ని కల్పించిందని పేర్కొన్నారు. దళితుల ఆత్మగౌరవాన్ని అవమానించినట్లే పట్టణ కాంగ్రెస్ అధ్యక్షుడు ఎండి రైసుద్దీన్, కాంగ్రెస్ పార్టీ అధికార ప్రతినిధి బత్తుల నరేష్ మాట్లాడుతూ దళితులు నడిచిన రహదారి మైలైందని భావించి పసుపు నీటితో శుద్ధి చేయడం నిజమైతే, ఇది కేవలం ఒక వ్యక్తిని అవమానించడం కాదు.. మొత్తం దళిత సమాజం ఆత్మగౌరవాన్ని అవమానించినట్లే. ప్రజా రహదారిపై ప్రతి పౌరుడికీ సమాన హక్కు ఉంది. ఇలాంటి కుల వివక్షను ఏ రూపంలోనూ సమర్థించలేం అని అన్నారు.సోషల్ మీడియాలో ప్రచారంలో ఉన్న వీడియోలు, ఫొటోలను అధికారులు పరిశీలించి సమగ్ర విచారణ చేపట్టి వాస్తవాలను వెలుగులోకి తీసుకురావాలని కాంగ్రెస్ నాయకులు డిమాండ్ చేశారు. అంటరానితనం, కుల వివక్షకు సంబంధించిన చట్టాల ప్రకారం బాధ్యులుగా తేలిన వారిపై తగిన చర్యలు తీసుకోవాలని కోరారు.కుల వివక్ష, అంటరానితనం రాజ్యాంగం ప్రతిపాదించే సమానత్వం, సామాజిక న్యాయం, మానవ గౌరవానికి విరుద్ధమని నాయకులు పేర్కొన్నారు. సమాజంలో ఇలాంటి వివక్షకు తావులేకుండా ప్రతి ఒక్కరూ రాజ్యాంగ విలువలను కాపాడేందుకు బాధ్యతగా వ్యవహరించాలని పిలుపునిచ్చారు. పాల్గొన్న నాయకులు ఈ కార్యక్రమంలో మెట్‌పల్లి పట్టణ కాంగ్రెస్ అధ్యక్షుడు ఎండి రైసుద్దీన్, మున్సిపల్ వైస్ చైర్మన్ ఓంకార్ నవీన్, కౌన్సిలర్లు రెబస్ మహేష్, జగిత్యాల జిల్లా కాంగ్రెస్ పార్టీ ప్రధాన కార్యదర్శి సూరి, మెట్‌పల్లి పట్టణ కాంగ్రెస్ జనరల్ సెక్రెటరీ మార్గం కిరణ్, పట్టణ మైనార్టీ అధ్యక్షుడు జాకీర్, మైలారపు రాంబాబు, ఎండి ముఖిమ్, రాజగోపాల్, షేక్, వెంకటేష్, యూత్ కాంగ్రెస్ నియోజకవర్గ అధ్యక్షుడు పెంట ప్రణయ్ తదితర సీనియర్, యువ నాయకులు పాల్గొన్నారు.

# స్పెషల్ సబ్‌జైల్‌లో భద్రతా ఏర్పాట్లను పరిశీలించిన ఎస్పీ

**చురకలు ప్రతినిధి,నిర్మల్, సెప్టెంబర్, 10 :** నిర్మల్ స్పెషల్ సబ్‌జైల్‌ను జిల్లా ఎస్పీ.జానకి షర్మిల గురువారం సందర్శించి జైలు భద్రతా ఏర్పాట్లను సమగ్రంగా పరిశీలించారు. స్పెషల్ సబ్‌జైలుకు చేరుకున్న జిల్లా ఎస్పీకి జైలు సూపరింటెండెంట్ పుష్పగుచ్ఛం అందించి స్వాగతం పలికారు. అనంతరం జైలు ప్రాంగణం, భద్రతా ఏర్పాట్లు, సీసీటీవీ కెమెరాల పనితీరు, ఖైదీలకు కల్పిస్తున్న మౌలిక సౌకర్యాలను ఎస్పీ పరిశీలించారు. జైలు భద్రతా ఏర్పాట్లు నిబంధనల ప్రకారం అమలవుతున్నాయా, భద్రతా సిబ్బంది విధులను సక్రమంగా నిర్వహిస్తున్నారా, జైలు పరిసరాల్లో పర్యవేక్షణ ఏ విధంగా



కొనసాగుతోంది అనే అంశాలను ఎస్పీ క్షుణ్ణంగా పరిశీలించారు. అనంతరం ఖైదీలతో నేరుగా మాట్లాడి వారి సమస్యలు, ఆరోగ్య పరిస్థితులు, వారికి అందుతున్న సౌకర్యాలపై వివరాలను అడిగి తెలుసుకున్నారు. ఖైదీల పట్ల నిబంధనలకు అనుగుణంగా వ్యవహరిస్తూ, వారికి అవసరమైన సౌకర్యాలు సక్రమంగా అందేలా చర్యలు తీసుకోవాలని సంబంధిత అధికారులకు సూచించారు. జైలు భద్రత విషయంలో ఎలాంటి నిర్లక్ష్యానికి, లోపాలకు తావులేకుండా సిబ్బంది ఎల్లప్పుడూ అప్రమత్తంగా విధులు నిర్వహించాలని ఎస్పీ సూచించారు. జైలు ప్రాంగణంలో నిరంతర పర్యవేక్షణ కొనసాగించాలని, భద్రతా ప్రమాణాలను కట్టుదిట్టంగా అమలు చేయాలని ఆదేశించారు. స్పెషల్ సబ్‌జైల్‌లో భద్రతా ఏర్పాట్లు, నిర్వహణలో సిబ్బంది చేస్తున్న కృషిని జిల్లా ఎస్పీ అభినందించారు. ఈ కార్యక్రమంలో నిర్మల్ డీఎస్పీ శ్రీనివాస్, సీఐ కృష్ణ, ఏఆర్ ఆర్ఐ రామ్‌నిరంజన్, జైలర్ సూర్యప్రకాశ్ రెడ్డి, హెడ్ వార్డెన్, జైలు గార్డింగ్ సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

# రైతులు ప్రత్యామ్నాయ సాగుపై దృష్టి సారించాలి

**-కనపర్తిలో 20 గుంటల్లో చేపలు, నాటుకోళ్లు, కూరగాయల సాగు పరిశీలించారు**
**-డీఆర్‌డీఓ గీత**

**చురకలు విలేఖరి వీణవంక సెప్టెంబర్ 10 :** రైతులు ప్రత్యామ్నాయ సాగుపై దృష్టి సారించాలని,రైతులు సంప్రదాయ పంటలకే పరిమితం కాకుండా సమీకృత వ్యవసాయం వైపు మొగ్గు చూపితే తక్కువ విస్తీర్ణంలోనే అధిక ఆదాయం పొందవచ్చని జిల్లా గ్రామీణాభివృద్ధి అధికారి (డీఆర్‌డీఓ) గీత అన్నారు.కనపర్తి గ్రామంలో రైతులు గుళ్ళ అనిల్ కుమార్,బంగారి కిరణ్ కుమార్ సంయుక్తంగా 20గుంటల విస్తీర్ణంలో చేపట్టిన సమీకృత చేపల పెంపకం యూనిట్‌ను గురువారం ఆమె అధికారులతో కలిసి సందర్శించారు.



అనంతరం డీఆర్‌డీఓ గీత మాట్లాడుతూ..రైతులు తక్కువ భూమిలో చేపలు,రొయ్యలు,కూరగాయలు, నాటుకోళ్ల పెంపకం వంటి ప్రత్యామ్నాయ మార్గాలను ఎంచుకోవాలని సూచించారు.కోళ్ల పెంపకానికి వీబీజీ రాంజీ పథకం ద్వారా షెడ్లు,ఫారం పాండ్లు మంజూరు చేస్తున్నామని,మహిళా సంఘాల ద్వారా స్త్రీనిధి, సీఐఎఫ్ రుణాల సౌకర్యం కల్పిస్తున్నామని పేర్కొన్నారు.మత్స్య శాఖ ద్వారా సబ్సిడీలను సద్వినియోగం చేసుకోవాలని ఆమె కోరారు.ఈ కార్యక్రమంలో అడిషనల్ డీఆర్‌డీఓ జె. రవికుమార్,డీపీఎంలు సతీష్, కరుణాకర్,గ్రామ సర్పంచ్ మహాకాళ ఉమ,ఏపీఎంలు సుధాకర్, రఘుపతి, సీసీలు ఘణశ్యామ్, ఎన్. ఆనంద్, ఎస్. తిరుపతి,ఎంఎస్‌సీసీ పద్మ, వీఓఏ పద్మ, ఈజీఎస్ ఈసీ రాజ్‌కుమార్, టీఏ రజిత తదితరులతో పాటు స్థానిక రైతులు పాల్గొన్నారు.

## అంబేద్కర్ సంఘం అధ్యక్షునిగా

# బీపేట రాజ్ కుమార్ ఏకగ్రీవం



**చురకలు ప్రతినిధి,ఎల్లారెడ్డి పేట సెప్టెంబర్ 10 :** ఎల్లారెడ్డిపేట మేజర్ గ్రామపంచాయతీలోని అంబేద్కర్ నగర్ సంఘం అధ్యక్షునిగా బీపేటరాజకుమార్ ఏకగ్రీవంగా ఎన్నికయ్యారు.

ఉపాధ్యక్షులుగా అంతేర్పుల దేవరాజు క్యాషియర్ మస్కూరి సంసోన్,రైటర్‌గా ఎనగందుల మారుతి అంగూరి ప్రవీణ్ కుమార్,ప్రధాన కార్యదర్శిగా ఏర్పుల సెంట్రింగ్ నరసయ్య కార్యదర్శులుగా: ఊసి మోసి,ఏర్పుల రాయరాం దేవయ్య **కార్యవర్గ సభ్యులు:**ఎలగందుల పోచయ్య అందే వీరయ్య అందే రాములు ఊసి బాలేళ్ళు అంతర్పులలక్ష్మణ్ అంతర్పుల దుర్గయ్య బాయికాడి నరసయ్య, బక్కి రవి మస్కూరి శ్రీనివాస్ అంగూరి ఆనందం ఏర్పుల బ్యాంకు రాజయ్య, సనుగుల పద్మయ, జేరిపోతుల రాములు జల్లిశంకర్, వీరిని అంబేద్కర్ సంఘం వారు ఎన్నుకోవడం జరిగింది, మాజీ అధ్యక్షులు అంతేర్పుల ఎల్లయ్య ఉపాధ్యక్షులు ఏర్పుల హనుమయ్య అంబేద్కర్ సంఘ ఆధ్వర్యంలో వారికి శాలువలతో పూల మాలలతో ఘన సన్మానం చేశారు ఈ సందర్బంగా వారిని ఘనంగా సన్మానించారుఈ కార్యక్రమంలో సర్పంచ్ ఎలగందుల నరసింహులు అంబేద్కర్ సంగం కుల పెద్దలు అంబేద్కర్ సంఘం యూత్ సభ్యులు తదితరులు పాల్గొన్నారు.

## మునిసిపల్ కార్యాలయం ఎదుట

# కార్మికుల నిరసన



**చురకలు ప్రతినిధి హుజురాబాద్ సెప్టెంబర్ 10 :** రెండు నెలల నుండి వేతనాలు రాకపోవడానికి నిరసిస్తూ హుజురాబాద్ మునిసిపల్ కార్మికులు గురువారం మున్సిపల్ కార్యాలయం ముందు విధులను బహిష్కరించి నిరసన తెలిపారు. తెలంగాణ మున్సిపల్ వర్కర్స్ యూనియన్ సిఐటియు ఆధ్వర్యంలో అధ్యక్షులు ఎండి అజ్జు,ఉపాధ్యక్షులు రాసపల్లి సరోజన, ప్రధాన కార్యదర్శి బోరగాల కుమార్ ఆధ్వర్యంలో నిరసన కార్యక్రమం జరిగింది. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ మున్సిపల్ కార్మికులకు ప్రతినెల వేతనాలు అందించాలని కోరారు. వేతనాలు రాక కార్మికులు అనేక ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. ప్రభుత్వం అధికారులు స్పందించి ఎప్పటికప్పుడు వేతనాలు చెల్లించాలని డిమాండ్ చేశారు.ఈ కార్యక్రమంలో కార్మిక నాయకులు రామగిరి సులోచన,వినోద,కుమార్, కాంత్ కుమార్,వాటర్ సప్లై, ఎలక్ట్రిషన్, హరితహారం కార్మికులు పాల్గొన్నారు.

# ఘనంగా చాకలి ఐలమ్మ వర్ధంతి వేడుకలు

**-భూమి,భుక్తి కోసం..వెట్టిచాకిరి విముక్తికి పోరాడిన వీరనారి ఐలమ్మ**



**చురకలు ప్రతినిధి ఎల్లారెడ్డిపేట సెప్టెంబర్ 10 :** భూమి,భుక్తి కోసం.. వెట్టిచాకిరి విముక్తికి పోరాడిన వీరనారి చాకలి ఐలమ్మ అని వక్తలు పేర్కొన్నారు. ఎల్లారెడ్డిపేట మండల కేంద్రంలో రజక కులస్తుల ఆధ్వర్యంలో తెలంగాణ వీరనారి చిట్యాల చాకలి ఐలమ్మ వర్ధంతి వేడుకలను గురువారం ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా ఐలమ్మ విగ్రహానికి నాయకులు పూల మాలలు వేసి ఘనంగా నివాళులు అర్పించారు.ఆమె చేసిన పోరాటాలను ఏఎంసీ వైస్ ప్రెసిడెంట్ గుండా డి రామిరెడ్డి కాంగ్రెస్ పార్టీ సీనియర్ నాయకులు బండారి బాల్రెడ్డి రజక సంఘం మండల వైస్ ప్రెసిడెంట్ వీరమ్మ గారిశంకర్,మండల కార్యదర్శి గొల్లపల్లి సురేష్‌లు ఆమె చేసిన సేవలను స్మరించుకున్నారు. సమాజంలోని అణగారిన వర్గాల హక్కుల కోసం ఐలమ్మ చేసిన పోరాటం స్ఫూర్తిదాయకమని కొనియాడారు.ఈ కార్యక్రమంలో ఏజీపీ పసుల కృష్ణ, బిజెపి పార్టీ నాయకులు నేవూరి శ్రీనివాస్ రెడ్డి మండల వైస్ ప్రెసిడెంట్ దొమ్మాటి దేవయ్య మండల్ కమిటీ సభ్యులు ఎల్లయ్య,అజయ్ తిమ్మాపూర్ సింగారం గ్రామ శాఖల అధ్యక్షులు రమేష్,గంగాధర ధర్మయ్య తదితరులు పాల్గొని పూలమాలలు వేసి నివాళులర్పించారు.

# మోదీ సేవా ప్రస్థానాన్ని ప్రజల్లోకి తీసుకెళ్లాలి




**చురకలు విలేఖరి వీణవంక సెప్టెంబర్ 10 :** ప్రధాని నరేంద్ర మోదీ 25 ఏళ్ల ప్రజా సేవ, సుపరిపాలనను ప్రజల్లోకి తీసుకెళ్లేందుకు 'సేవా సంకల్ప్ అభియాన్'ను విజయవంతం చేయాలని బీజేపీ నాయకులు పిలుపునిచ్చారు. మండల అధ్యక్షుడు బత్తిని నరేష్ గౌడ్ ఆధ్వర్యంలో నిర్వహించిన కార్యశాలకు బీజేపీ జిల్లా ఉపాధ్యక్షుడు గుర్రాల వెంకటరెడ్డి ముఖ్య అతిథిగా హాజరయ్యారు. సెప్టెంబర్ 17నుంచి అక్టోబర్ 17వరకు నెల రోజుల పాటు బూత్ స్థాయిలో సేవా కార్యక్రమాలు నిర్వహించి, కేంద్ర సంక్షేమ పథకాలను ప్రతి ఇంటికీ చేరవేయాలని కార్యకర్తలకు దిశానిర్దేశం చేశారు.మోదీ నాయకత్వంలో దేశం ఆత్మనిర్భరత దిశగా సాగుతోందని పేర్కొన్నారు.ఈ కార్యక్రమంలో రామిడి ఆదిరెడ్డి,ఉడుత కుమార్,ముత్యాల రవీందర్,సర్పంచులు నల్లగొని రాజారాం, దాట్ల వీరస్వామి, అప్పని కొమురయ్య,నాని,కార్యకర్తలు పాల్గొన్నారు.

# హుజురాబాద్‌లో..

# స్టడీ మెటీరియల్ ఆవిష్కరణ



**చురకలు ప్రతినిధి హుజురాబాద్ సెప్టెంబర్ 10 :** హుజురాబాద్ మండల విద్యా వనరుల కేంద్రంలో తెలంగాణ రాష్ట్రసాంఘిక శాస్త్ర ఫోరం రూపొందించిన ఆరవ తరగతి స్టడీ మెటీరియల్‌ను మండల విద్యాధికారి విడపు శ్రీనివాస్ గురువారం ఆవిష్కరించారు. సాంఘిక శాస్త్ర ఫోరం నిర్వహిస్తున్న కార్యక్రమాలను అభినందిస్తూ మెటీరియల్ ను పాఠశాల లైబ్రరీలో అందుబాటులో ఉంచాలని సూచించారు. విద్యార్థులు ఈ స్టడీ మెటీరియల్ను ఉపయోగించుకోవాలని కోరారు. ఈ కార్యక్రమంలో సాంఘిక శాస్త్ర ఫోరం ప్రతినిధులు ఓరుగంటి తిరుపతి, కొండి రవీందర్, శ్రీనివాస్ రెడ్డి, వెంకట్రాజ్యం, ఆసియా, భూపతి లక్ష్మి, వెంకటేషం, అరుణ్ కుమార్, నేరెళ్ల ప్రశాంత్, సంపత్ విద్యార్థులు పాల్గొన్నారు.

## తెలంగాణ విమోచన దినాన్ని రాష్ట్ర ప్రభుత్వం అధికారికంగా జరపాలి

**-తాసిల్దార్ గారికి వినతి పత్రం అందజేసిన బిజెపి నాయకులు**




**చురకలు ప్రతినిధి ఎల్లారెడ్డిపేట సెప్టెంబర్ 10 :** సెప్టెంబర్ 17 తెలంగాణ విమోచన దినాన్ని రాష్ట్ర ప్రభుత్వం అధికారికంగా నిర్వహించాలని.. హైదరాబాద్ విమోచనలో కీలకపాత్ర పోషించిన సర్దార్ వల్లభాయ్ పటేల్ కు హైదరాబాద్ లో భారీ " "స్టాట్యూ ఆఫ్ లిబరేషన్ – తెలంగాణ నిర్మించాలనిభారతీయ జనతా పార్టీ ఎల్లారెడ్డిపేట మండల శాఖ అధ్యక్షుడు రేపాక రామచంద్ర రెడ్డి ఆధ్వర్యంలో గురువారం బిజెపి పార్టీ శ్రేణులు ఎల్లారెడ్డిపేట తహసీల్దారుకు వినతి పత్రం సమర్పించారు హైదరాబాద్ లో తెలంగాణ విమోచన మ్యూజియం ఏర్పాటు చేయాలని. ప్రతి జిల్లా కేంద్రంలో తెలంగాణ విమోచన స్ఫూర్తి కేంద్రం ఏర్పాటు చేయాలని. పాఠ్యపుస్తకాల్లో తెలంగాణ విమోచన చరిత్ర అజ్ఞాతవీరుల అధికార జాబితా ఏర్పాటు చేయాలని."అమరవీరుల త్యాగం తెలంగాణ ఆత్మగౌరవం సెప్టెంబర్ 17 తెలంగాణ విమోచన దినం నిర్వహించాలని స్థానిక తాసిల్దార్‌కు వినతిపత్రం అందజేశారు. ఈ కార్యక్రమంలో మండల ప్రధాన కార్యదర్శి కృష్ణ హరి జిల్లా కౌన్సిలింగ్ మెంబర్ చందుపట్ల లక్ష్మారెడ్డి ఎస్టీ మోర్చా కిరణ్ నాయక్ శ్రీనివాస్ రెడ్డి బందరపు లక్ష్మారెడ్డి సంజీవరెడ్డి బాలకృష్ణగౌడ్ బాలగౌడ్ రవిశంకర్ వంగల రాజిరెడ్డి రంజిత్ గణేష్ నాయక్ రాజు నాయక్ రవినాయక్ జవహర్ బాల్ రెడ్డి అంతర్పుల తిరుపతి చరణ్ గౌడ్ కార్యకర్తలు నాయకులు పాల్గొన్నారు.


## ఒకప్పటి చెస్ ఛాంపియన్ ఇక లేరు

**- ఆధ్యాత్మికతలో సాధకుడు**

**- మంథని 'చదరంగం' ఛాంపియన్ రామడుగు ప్రభాకర్ కన్నుమూత**



**చురకలు ప్రతినిధి కమాన్‌పూర్ (మంథని) సెప్టెంబర్ 10 :** మంథని ప్రాంతంలో చదరంగం ఆటకు జీవం పోసిన రిటైర్డ్ ఉపాధ్యాయుడు, ఆధ్యాత్మిక చింతనాపరుడు రామడుగు ప్రభాకర్ (90) గురువారం కన్నుమూశారు. ఆయన మృతి పట్ల పలువురు ప్రముఖులు, విద్యావేత్తలు, క్రీడాభిమానులు తీవ్ర సంతాపం వ్యక్తం చేశారు. చదరంగంపై అపారమైన ఆసక్తి, పట్టుతో ఎందరో యువతకు ప్రభాకర్ స్ఫూర్తిగా నిలిచారు. మంథనిలో చదరంగాన్ని ప్రోత్సహించడంతో పాటు పలువురిలో ఆటపై ఆసక్తిని పెంచారు. ఆయన ప్రావీణ్యాన్ని గుర్తించి ఆ కాలంలో పలువురు ప్రేమతో 'గ్రాండ్ మాస్టర్' అని పిలిచేవారు. ఉపాధ్యాయ వృత్తి నుంచి పదవీ విరమణ అనంతరం ఆయన పూర్తిగా ఆధ్యాత్మిక చింతన వైపు మళ్లారు. మంథనిలోని హరే రామ హరే కృష్ణ ఆశ్రమం స్థాపకుడిగా కొనసాగుతూ ప్రతినిత్యం ఆధ్యాత్మిక కార్యక్రమాల్లో నిమగ్నమయ్యారు. నిరాడంబర జీవనశైలితో అందరితో ఆప్యాయంగా మెలిగారు. ప్రభాకర్‌కు భార్య రాధామణి, ముగ్గురు కుమార్తెలు, ఇద్దరు కుమారులు ఉన్నారు. పెద్ద కుమారుడు శ్రీనివాస్ మంచిర్యాల సాయిబాబా ఆలయంలో 35 సంవత్సరాలు పూజారిగా సేవలందించి, ప్రస్తుతం మంథనిలోని శ్రీ షిర్డీ



సాయిబాబా ఆలయంలో అర్చకులుగా కొనసాగుతున్నారు. చిన్న కుమారుడు ఖతర్‌లో ఉద్యోగం చేస్తున్నారు. చదరంగ ప్రోత్సాహకుడిగా, ఉపాధ్యాయుడిగా, ఆధ్యాత్మిక సాధకుడిగా ప్రభాకర్ అందించిన సేవలు మంథని ప్రజల జ్ఞాపకాల్లో చిరస్థాయిగా నిలిచిపోతాయని పలువురు పేర్కొన్నారు. ఆయన మృతి మంథని ప్రాంతానికి తీరని లోటని సంతాపం వ్యక్తం చేశారు.

# క్రీడల ద్వారా మానసిక ఉల్లాసం కలుగుతుంది



**చురకలు విలేఖరి,కరీంనగర్, సెప్టెంబర్, 10 :** క్రీడలు విద్యార్థుల జీవితంలో చాలా కీలకంగా వ్యవహరిస్తాయని మరియు వివిధ రకాల క్రీడలలో పాల్గొనడం ద్వారా కలిగేటువంటి ఉపశమనం చాలా గొప్పనైనదని అల్ఫోర్స్ విద్యాసంస్థల నిర్వాహకులు శ్రీ మల్లారెడ్డి గారు స్థానిక కొత్తపల్లిలోని అల్ఫోర్స్ ఇ-టెక్నో పాఠశాలలో 70వ SGF కొత్తపల్లి (H) మండల స్థాయి కబడ్డీ,ఖో-ఖో, వాలీబాల్ & అథ్లెటిక్స్ అండర్ 14 & 17 బాలికల పోటీల ప్రారంభోత్సవానికి మండల విద్యాశాఖ అధికారి తుమ్మ ఆనందంతో కలిసి వారు ముఖ్య అతిథిగా మాట్లాడారు. ఈ సందర్భంగా విద్యార్థులందరూ వివిధ రకాల క్రీడలను వివిధ సమయాల్లో పాల్గొని వారి యొక్క నైపుణ్యాన్ని ప్రదర్శించాలని మరియు పోటీతత్వాన్ని సైతం పెంపొందించు కోవాలని వారు సూచించారు. నేటి పోటీ ప్రపంచంలో ప్రతి ఒక్కరికి క్రీడలు అనివార్యం అయినవని మరియు క్రీడల్లో పాల్గొనడం ద్వారా ప్రత్యేక గుర్తింపు సైతం సమాజంలో సొంతం చేసు కోవచ్చని వారు చెప్పారు. అల్ఫోర్స్ విద్యాసంస్థలు విద్యతో పాటు క్రీడా రంగానికి చాలా ప్రాముఖ్యత ఇస్తుందని మరియు క్రీడారంగాన్ని ప్రోత్స హించడంలో అల్ఫోర్స్ అగ్రగామిగా ఉంటుందని వారు చెప్పారు. విద్యార్థుల్లో క్రీడా నైపుణ్యాన్ని పెంపొందించడానికి అల్ఫోర్స్ విద్యార్థులకు టోర్నమెంట్లు సైతం నిర్వహిస్తున్నదని మరియు కావలసిన టువంటి కోచింగ్ ఎపిస్తుందని వారు చెప్పారు. విశిష్ట అతిథిగా విచ్చేసిన మండల విద్యాధికారి ఆనందం మాట్లాడుతూ క్రీడలలో పాల్గొన్నవారు చదువులో కూడా హుషారుగా చదివి అగ్రగామిగా ఉంటారని చెప్పారు. క్రీడల యొక్క ప్రాముఖ్యతను దృష్టిలో పెట్టుకొని అల్ఫోర్స్ విద్యాసంస్థల్లో విద్యార్థులకు నిపుణులైన కోచ్లే శిక్షణ ఇప్పించడం చాలా గొప్ప విషయమని మరియు వివిధ స్థాయిలలో నిర్వహింపబడుతు న్నటువంటి వివిధ రకాల పోటీలకు చేయూతనివ్వడం జరుగుతుందని వారు చెప్పారు. ఇందులో భాగంగా నేడు పాఠశాలలో 70వ SGF కొత్తపల్లి(H) మండల స్థాయి కబడ్డీ,ఖో-ఖో,వాలీబాల్ అథ్లెటిక్ టోర్నమెంట్ అండర్ 14& 17బాలికల టోర్నమెంట్ ప్రారంభించడం జరిగిందని వారు చెప్పారు. ఈ టోర్నమెంట్లో నేడు సుమారు 400 మంది క్రీడాకారులు వివిధ ప్రభుత్వ మరియు ప్రైవేటు పాఠశాలల నుండి విచ్చేసారని వారు చెప్పారు. అదేవిధంగా విచ్చేసిన వారందరికీ "అల్ఫోర్స్" భోజన వసతిని కల్పించడం చాలా హర్షించదగ్గ విషయ మని మరియు విద్యా సంస్థల వారికి ధన్యవాదాలు తెలియజేశారు. ఈ కార్య క్రమంలో బన్సీ లాల్,జిల్లా కార్యదర్శి, SGF,గిన్నె లక్ష్మణ్ గారు, SGF మండల ఆర్గనైజింగ్ సెక్రటరీ,పీడీలు ఎల్ వి రమణ,వి.శ్రీనివాస్, ఏ.శ్రీనివాస్ ,సుష్మ,ఓం ప్రకాష్, ప్రతినిధులు,వివిధ జట్ల మేనేజర్లు,కోచ్‌లు,వివిధ పాఠశాలల ప్రతినిధులు మరియు వివిధ పాఠశాలల నుండి విచ్చేసిన ఉపాధ్యాయులు & విద్యార్థులు పాల్గొన్నారు.

# మట్టి వినాయక విగ్రహాలను పూజించాలి

**-కలెక్టర్ గరిమ అగ్రవాల్**

**-తెలంగాణ కాలుష్య నియంత్రణ మండలి ఆధ్వర్యంలో ఉచితంగా మట్టి వినాయక విగ్రహాల పంపిణీ**

**-పోస్టర్లను ఆవిష్కరించిన జిల్లా కలెక్టర్ గరిమ అగ్రవాల్, ఎస్పీ మహేష్ బి గితె**



**చురకలు ప్రతినిధి, సిరిసిల్ల, సెప్టెంబర్ 10 :** పర్యావరణ పరిరక్షణలో భాగంగా మట్టితో తయారు చేసిన వినాయక విగ్రహాలను ప్రతిష్టించాలని జిల్లా కలెక్టర్ గరిమ అగ్రవాల్ పిలుపు నిచ్చారు. తెలంగాణ కాలుష్య నియంత్రణ మండలి ఆధ్వర్యంలో ఉచితంగా మట్టి వినాయక విగ్రహాల పంపిణీ కార్యక్రమాన్ని జిల్లా సమీకృత కార్యాలయాల సముదాయం లో గురువారం జిల్లా కలెక్టర్ గరిమ అగ్రవాల్,ఎస్పీ మహేష్ బి గితె ప్రారంభించారు. అనంతరం పోస్టర్లు ఆవిష్కరించారు. 2వేల విగ్రహాలను పంపిణీ చేయాలని సూచించారు. జిల్లా కలెక్టర్ మాట్లాడుతూ..గణేష్ నవరాత్రి ఉత్సవాలను పర్యావరణహితంగా నిర్వహించాలని సూచించారు. ముఖ్యంగా ప్లాస్టర్ ఆఫ్ పారిస్ తో తయారు చేసిన వినాయక విగ్రహాలకు బదులుగా మట్టి వినాయక విగ్రహాలను వినియోగించాలని కోరారు. పర్యావరణహితమైన గణేష్ నవరాత్రి ఉత్సవాల నిర్వహణకు ప్రజలందరూ భాగస్వాములు కావాలని, ప్రకృతి, జలవనరులను కాపాడుతూ భక్తిశ్రద్ధలతో పండుగను చేసుకోవాలని జిల్లా కలెక్టర్ పిలుపు నిచ్చారు. కార్యక్రమంలో అదనపు కలెక్టర్ గడ్డం నగేష్, ఆయా శాఖల అధికారులు, తెలంగాణ కాలుష్య నియంత్రణ మండలి ఏఈఈ శ్రావణ్ తదితరులు పాల్గొన్నారు.

# వినాయక నవరాత్రులు ప్రశాంతంగా నిర్వహించుకోవాలి

**-ఏసిపి వాసంశెట్టి మాధవి**



**చురకలు ప్రతినిధి హుజురాబాద్ సెప్టెంబర్ 10 :** హుజురాబాద్ సబ్ డివిజన్లో వినాయక నవరాత్రి ఉత్సవాలు ప్రశాంతంగా నిర్వహించుకోవాలని, నిర్వాహకులు ప్రభుత్వ అధికారులకు సిబ్బందికి సహకరించాలని స్థానిక ఏసిపి వాసంశెట్టి మాధవి కోరారు. గురువారం ఆమె స్థానిక మున్సిపల్ చైర్మన్ ఆర్ సుహాసిని, సీఐ కరుణాకర్ తో కలిసి కాకతీయ కాలువ వద్ద నిమజ్జన స్థలాన్ని పరిశీలించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ.. వినాయక నవరాత్రి ఉత్సవాలకు సంబంధించిన సమాచారాన్ని పోలీసులకు అందించాలని కోరారు. గ్రామస్తులకు ప్రజలకు ఇబ్బంది కలగని రీతిలో వ్యవహరించాలని కోరారు. మితిమీరిన ధ్వని కాలుష్యాన్ని కలిగించవద్దన్నారు. మండపాల వద్ద రక్షణ ఏర్పాట్లు చేయాలని సూచించారు. ముఖ్యంగా విద్యుత్తు సరఫరా విషయం లో జాగ్రత్తలు వహించాలని, లేకుంటే ప్రమాదాలు జరిగేఆస్కారం ఉందన్నారు. వినాయక ప్రతిమలను వాహనాల్లో తరలించే క్రమంలో విద్యుత్తు తీగల పట్ల ప్రమాదంగా ఉండాలని కోరారు. నిమజ్జన ఉత్సవాన్ని ప్రశాంతంగా నిర్వహించుకోవాలని,పోలీసుఅధికారులు సూచించిన మార్గంలోనే అనుకున్న సమయంలో నిమజ్జ నోత్సవం పూర్తి చేయాలని కోరారు. ఈ కార్యక్రమంలో అధికారులు సిబ్బంది పాల్గొన్నారు.

# పోలీస్- అటవీశాఖ అధికారులు సమన్వయంతో పని చేయాలి

**-జగిత్యాల జిల్లా ఎస్పీ అశోక్ కుమార్**




**చురకలు ప్రతినిధి, జగిత్యాల, సెప్టెంబర్ 10 :** జిల్లాలో అటవీ సంపద, వన్యప్రాణుల రక్షణకు పోలీస్, అటవీ శాఖలు పరస్పర సమన్వయంతో మరింత సమర్థవంతంగా పనిచేయాలని జిల్లా ఎస్పీ అశోక్‌కుమార్ సూచించారు. గురువారం జిల్లా పోలీస్ ప్రధాన కార్యాలయంలో పోలీస్, అటవీ శాఖల అధికారులతో నిర్వహించిన కోఆర్డినేషన్ సమావేశంలో జిల్లాలో అటవీ పరిరక్షణకు సంబంధించి చేపడుతున్న చర్యలు, ఇరు శాఖలు ఎదుర్కొంటున్న సమస్యలు, పరస్పర సహకారం అవసరమైన అంశాలపై ఎస్పీ సమీక్ష నిర్వహించారు. అటవీ ప్రాంతాల్లో జరుగుతున్న అక్రమ కార్యకలాపాలు, అక్రమ కలప రవాణా, వన్యప్రాణుల వేట, అటవీ భూముల ఆక్రమణ తదితర అంశాలపై ప్రత్యేకంగా చర్చించారు.ఈ సందర్భంగా ఎస్పీ మాట్లాడుతూ అటవీ భూములు ఆక్రమణ,అక్రమ కలప రవాణా, వన్యప్రాణుల వేటను ఎట్టి పరిస్థితుల్లోనూ ఉపేక్షించవద్దని అధికారులకు సూచించారు. అటవీ ప్రాంతాల్లో అనుమానాస్పద వ్యక్తులు, వాహనాల కదలికలపై నిఘా పెంచాలని,అక్రమ రవాణాకు పాల్పడుతున్న వ్యక్తులపై సమాచారాన్ని సేకరించి చట్టపరంగా కఠిన చర్యలు తీసుకోవాలని తెలిపారు. అవసరమైన ప్రాంతాల్లో తనిఖీలు ముమ్మరం చేయడంతో పాటు, అటవీ శాఖకు అందుబాటులో ఉన్న సమాచారాన్ని పోలీస్ శాఖతో పంచుకోవాలని సూచించారు.అటవీ భూముల ఆక్రమణకు సంబంధించిన అంశాలపై కూడా ప్రత్యేక దృష్టి సారించాలని ఎస్పీ పేర్కొన్నారు.అటవీ భూముల్లో అనధికారికంగా చేపడుతున్న కార్యకలాపాలను గుర్తించి, సంబంధిత శాఖల సమన్వయంతో వాటిని అరికట్టేందుకు చర్యలు చేపట్టాలన్నారు. వన్యప్రాణుల సంరక్షణలో భాగంగా వేటగాళ్ల కదలికలపై నిఘా పెంచాలని, అటవీ ప్రాంతాలకు సమీపంలోని గ్రామాల ప్రజలతో సమన్వయం చేసుకుని అనుమానాస్పద కార్యకలాపాలపై సమాచారం సేకరించాలని తెలిపారు. అటవీ ప్రాంతాలకు సమీపంలోని గ్రామాల్లో ప్రజలకు అవగాహన కార్యక్రమాలు నిర్వహించి, వన్యప్రాణుల వేట, కలప అక్రమ రవాణా, అటవీ భూముల ఆక్రమణ వల్ల కలిగే నష్టాలపై వివరించాలని సూచించారు. ఈ సమావేశంలో అదనపు ఎస్పి చేతన్ నితిన్, డిఎఫ్ వో రవి ప్రసాద్, డిఎస్పి రాములు, ఫారెస్ట్ రేంజ్ ఆఫీసర్ లు, సిఐలు,ఎస్.ఐ లు పాల్గొన్నారు.

# బీసీలు తిరుగబడితేనే మేలు

**-ఢిల్లీ పెద్దల నిర్ణయలు కుట్రపూరితం**

**-సంక్షేమ పథకాల వెనుక బీసీలకు తీరని ద్రోహం**



**చురకలు,పెద్దపల్లి ప్రతినిధి, సెప్టెంబర్ 10 :** ఓబిసిల సామాజిక అభివృద్ధికి కేంద్రం అడ్డుకుంటుందని జనగణలలో కుల గణన చేస్తే కేంద్రం రాజ్యాధికారం వదులుకోవాల్సి వస్తుంద నే భయంతో ఓబీసీల వాటా తేల్చకుండా అడ్డుకుంటున్నారని కాకతీయ యూనివర్సిటీ విశ్రాంతి ప్రొఫెసర్ జాతీయ జ్యోతిరావు పూలే సత్యశోధక అధ్యక్షులు కే మురళి మనోహర్ మరియు ప్రొఫెసర్ తిరునగరి శేషు లు అభిప్రాయపడ్డారు .గురువారం పెద్దపల్లిలో బహుజన ప్రజాస్వామిక వేదిక వ్యవస్థాపక అధ్యక్షులు తాడూరి శ్రీమన్నారాయణ అధ్యక్షతన జరిగిన ఓబీసీల రౌండ్ టేబుల్ సమావేశానికి వారు ముఖ్య అతిథులుగా హాజరై జనగణలలో కులగనన మరియు భవిష్యత్తు బిసి ఉద్యమ కార్యచరణ పై ప్రసంగించారు. వెనుకబడిన వర్గాల వారి లెక్కలు తేల్చకపోవడం వల్ల ఆర్థికంగా రాజకీయంగా సామాజికంగా పారిశ్రామికంగా విద్యాపారంగా ఉద్యోగ పరంగా అనేక రంగాలలో వెనుకబడి పోతున్నామని పేర్కొన్నారు కేంద్రం ఇప్పటికైనా డ్రాప్ డౌన్ పద్ధతిలో కుల గణన చేసి ప్రతి కులానికి క్యాస్ట్ కోడ్ ఇవ్వాలని డిమాండ్ చేశారు. కుట్ర పూరితంగానే ఓబీసీల లెక్కలు తేల్చకుండా కేంద్రం అణచి వేస్తుందని ఆరోపించారు బీసీలు తనకు తాను బానిసత్వంలోకి లొంగిపోతూ రాజ్యాధికారం ఇతరుల చేతిలో పెడుతున్నారని వారు ఆవేదన చెందారు బీసీలు బానిసత్వ భావజాలం విడిచిపెట్టి విముక్తి ఉద్యమాలకు శ్రీకారం చుట్టాలని కోరారు బలమైన బీసీ ఉద్యమ నిర్మాణానికి తెలంగాణ నేల కదులుతుందని భవిష్యత్తు బీసీ ఉద్యమ విస్ఫోటంలో పెద్దపెల్లి జిల్లా ఉద్యమానికి కీలక భాగస్వామ్యం కానుంది ఆశాభావం వ్యక్తం చేశారు తాడూరి శ్రీమన్నారాయణ స్థాపించిన బహుజన ప్రజాస్వామిక వేదిక నిర్మాణాత్మకమైన బీసీ ఉద్యమాలకు శ్రీకారం చుట్టాలని ఆకాంక్షించారు కులాల వైశ్యమ్యాల తో బీసీలు అస్తిత్వాన్ని కోల్పోతున్నారని పేర్కొన్నారు తెలంగాణ ఉద్యమంలో వెనుకబడిన వర్గాల వారి త్యాగాల వల్లనే రాష్ట్రం ఆవిర్భవించిందని తెలిపారు రాష్ట్రంలో 56% ఉన్న బీసీలు రాజ్యాధికారంలో వాటా దక్కే వరకు అస్తిత్వ ఉద్యమాలు చేయవలసిందిగా పిలుపునిచ్చారు కేంద్ర రాష్ట్ర ప్రభుత్వాలు అడుగడుగున బీసీలను అణిచివేస్తు న్నాయని అన్నారు ప్రభుత్వ సంక్షేమ పథకాలకు ఆశపడి సామాజిక అభివృద్ధి లేకుండా ఆర్థిక అనిచి వేతకు నెట్టు వేయబడుతున్నారని అన్నారు ప్రభుత్వ ఉచిత పథకాలకు ఆశాజీవులుగా బీసీలు నిలిచిపోయారని అన్నారు.జిల్లా స్థాయిలో జరిగిన ఈ సమావేశానికి అనేక బీసీ సంఘాలతో పాటు కుల సంఘాల ప్రతినిధులు విద్యార్థులు ఉద్యోగ ఉపాధ్యాయ కార్మిక రంగాలకు చెందిన బీసీలు పాల్గొని భవిష్యత్తు జన గణనలో కులగలను చేపట్టే వరకు అంకిత భావంతో ఉద్యమం చేస్తామని ఢిల్లీ పీఠం కదిలేలా ప్రజల ఆందోళన చేస్తామని అనేక మంది వక్తలు తెలిపారు.

# కాకతీయ కాలువకు నీటిని విడుదల చేయండి

**-అన్నదాతలను ఆదుకోండి**

**-బి ఆర్ ఎస్ రైతు సంఘం రాష్ట్ర ఉపాధ్యక్షుడు ఎడవల్లి కొండల్ రెడ్డి**



చురకలు ప్రతినిధి హుజురాబాద్ సెప్టెంబర్ 10 : లోయర్ మానేరు డ్యామ్ (ఎల్ఎండీ)లో ప్రస్తుతం సుమారు 10 టీఎంసీల మేర నీరు నిల్వ ఉన్నందున, ప్రభుత్వం వెంటనే స్పందించి కాకతీయ కాలువ ద్వారా నీటిని విడుదల చేయాలని అన్నదాతలను ఆదుకోవాలని బీఆర్ఎస్ రైతు సంఘం రాష్ట్ర ఉపాధ్యక్షుడు ఎడవెల్లి కొండల్ రెడ్డి డిమాండ్ చేశారు. గురువారం ఆయన విలేకరులతో మాట్లాడుతూ..స్థానిక నియోజకవర్గంలో తాగునీటికి, సాగునీటికి తీవ్ర ఇబ్బందులు ఎదురవుతున్నాయని, ఖరీఫ్ లోనే పంటలు ఎండిపోయే పరిస్థితి ఏర్పడిందని ఆందోళన వ్యక్తం చేశారు. కాలువల ద్వారా కనీసం రెండు తడులైనా నీటిని విడుదల చేస్తే గ్రామాల్లోని చెరువులు, కుంటలను నింపుకోవడానికి అవకాశం ఉంటుందన్నారు. చెరువులు నింపడం వల్ల భూగర్భ జలాలు పెరిగి రైతులకు పంటలకు, ప్రజలకు తాగునీటికి ఇబ్బందులు తలెత్తకుండా ఉంటాయని అన్నారు. ?ఎల్ఎండీలో తగినంత నీరు అందుబాటులో ఉన్నప్పటికీ అధికారులు నిర్లక్ష్యం వహించకుండా వెంటనే యుద్ధప్రాతిపదికన చర్యలు చేపట్టి కాకతీయ కాలువ ద్వారా నీటిని విడుదల చేసి రైతాంగాన్ని, ప్రజలను ఆదుకోవాలని ప్రభుత్వాన్ని కోరారు.

## ఎంబీబీఎస్ సీటు సాధించిన విద్యార్థికి ఘన సన్మానం



**చురకలు విలేకరి, మల్లాపూర్, సెప్టెంబర్ 10 :** మల్లాపూర్ మండల కేంద్రానికి చెందిన శంభు తిరుపతి దంపతుల కుమారుడు త్రినయ్ ఇటీవల జరిగిన ఎంబీబీఎస్ మొదటి రౌండ్ కౌన్సిలింగ్ ఫలితాల్లో స్టేట్ మెరిట్ ర్యాంక్ సాధించిన సందర్భంగా అఖిల భారత యాదవ మహాసభ మండల అధ్యక్షుడు సంగ గంగరాజం ఆధ్వర్యంలో ఘనంగా సన్మానం చేసి స్వీట్లు పంచారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ వైద్యుడిగా ఎదగాలనే లక్ష్యంతో చదువుపై ప్రత్యేక శ్రద్ధ కనబరుస్తూ క్రమశిక్షణతో కష్టపడి చదివి మంచి ర్యాంకు సాధించడం ఎంతోమంది విద్యార్థులకు ఆదర్శం భవిష్యత్తులో మంచి వైద్యుడిగా ఎదిగి ప్రజలకు సేవ చేయాలని ఆకాంక్షించారు. ఈ కార్యక్రమంలో అరకంటి గంగ మల్లయ్య,వేల్పుల రాజం, జాల మల్లేష్, ఎగుర్ల సోమయ్య,తొట్ల మల్లయ్య, బింగి మల్లేష్, మధు, సంపత్,రాజమల్లయ్య తదితరులు పాల్గొన్నారు.

## బీఆర్ఎస్ నేతలపై ఎస్సీ,ఎస్టీ కేసు నమోదు చేయాలి




**చురకలు విలేకరి, జగిత్యాల, సెప్టెంబర్ 10 :** ఎర్రవల్లి కేసీఆర్ ఫామ్ హౌస్ వద్ద శుద్ధికరణ చేసిన బీఆర్ఎస్ నాయకులపై ఎస్సీ, ఎస్టీ అట్రాసిటీ కేసు నమోదు చేయాలని డీసీసీ ఎస్సీ విభాగం చైర్మన్ దుమాల రాజ్ కుమార్ డిమాండ్ చేశారు. టీపీసీసీ ఎస్సీ విభాగం చైర్మన్ డా. కవ్వంపల్లి సత్యనారాయణ ఆదేశాల మేరకు బుధవారం జగిత్యాల టౌన్ పోలీస్ స్టేషన్‌లో ఆయన ఫిర్యాదు చేశారు. దళితుల దండోరా కార్యక్రమంలో భాగంగా దళిత బిడ్డలు ఫామ్ హౌస్ ముందు నిరసన తెలిపితే, ఆ ప్రదేశం మైల పడిందంటూ గంగాజలం, పసుపు నీళ్లతో బీఆర్ఎస్ నేతలు శుద్ధి చేయడం దళిత సమాజాన్ని అవమానించడమేనని అన్నారు. ఇటీవల స్పీకర్ గడ్డం ప్రసాద్‌ను బీఆర్ఎస్ నేత తాతా మధు అసభ్యంగా దూషించారని, ఇప్పుడు శుద్ధి కార్యక్రమం చేపట్టడం బీఆర్ఎస్, బీజేపీ దళిత వ్యతిరేకతకు నిదర్శనమని, ఈ మనువాద భావజాల పార్టీలు అత్యంత ప్రమాదకరమని అన్నారు.ఈ కార్యక్రమంలో కౌన్సిలర్లు బడుగు రాజేందర్, బొల్లారపు గిరిధర్, రిటైర్డ్ ఎంఈవో మద్దెల నారాయణ, ఎస్సీ, ఎస్టీ అట్రాసిటీ కమిటీ సభ్యులు నక్క అశోక్, కంటే అంజయ్య, కోలేపాక మల్లేష్, కడమండ కమలాకర్ తదితరులు పాల్గొన్నారు.

## హామీలు అమలు చేయలేక అరెస్టులా?

**చురకలు విలేకరి, జగిత్యాల, సెప్టెంబర్ 10 :** హామీలు అమలు చేయలేక ప్రశ్నించే గొంతులను కాంగ్రెస్ ప్రభుత్వం అరెస్టు చేస్తోందని బీఆర్ఎస్వీ రాష్ట్ర కార్యదర్శి, న్యాయవాది పాదం తిరుపతి విమర్శించారు. 420 హామీలతో అధికారంలోకి వచ్చి ప్రశ్నిస్తే అక్రమ అరెస్టులు చేయడం ఏమిటని ప్రశ్నించారు. ప్రజా సమస్యలపై ప్రశ్నిస్తున్న తనను, బీఆర్ఎస్వీ జిల్లా నాయకుడు నేరెళ్ల మహేష్, జగిత్యాల నియోజకవర్గ ఇంఛార్జి వెంకటేష్, బీఆర్ఎస్ నాయకుడు చెవుల రవీందర్‌ను జగిత్యాల పట్టణ పోలీసులు ముందస్తుగా అరెస్టు చేయడాన్ని తీవ్రంగా ఖండిస్తున్నామన్నారు.ప్రజాస్వామ్యంలో ప్రశ్నించే హక్కును పోలీసు చర్యలతో అణచివేయడం సరికాదని, ఫీజు రీయింబర్స్‌మెంట్ బకాయిలను వెంటనే విడుదల చేయాలని డిమాండ్ చేశారు.అరెస్టులతో ఉద్యమాలను అడ్డుకోలేరని,అక్రమ అరెస్టులకు భయపడేది లేదని, ప్రజల తరఫున పోరాటం కొనసాగిస్తామని స్పష్టం చేశారు.

# ఎస్ఐఆర్ ప్రక్రియను పకడ్బందీగా నిర్వహించాలి

**-నిర్మాణంలో ఉన్న పట్టణ ప్రాథమిక ఆరోగ్య కేంద్రం భవనాన్ని త్వరగా ప్రారంభించాలి**
**-జగిత్యాల జిల్లా కలెక్టర్ బి. సత్యప్రసాద్**



**చురకలు ప్రతినిధి, కోరుట్ల, సెప్టెంబర్ 10 :** ఎస్ఐఆర్ ప్రక్రియను పకడ్బందీగా నిర్వహించాలని, నిర్మాణంలో ఉన్న పట్టణ ప్రాథమిక ఆరోగ్య కేంద్రం భవనాన్ని త్వరగా ప్రారంభించాలని జగిత్యాల జిల్లా కలెక్టర్ బి. సత్యప్రసాద్ అన్నారు. గురువారం కోరుట్ల పట్టణం లో కొనసాగుతున్న ఓటర్ల జాబితా ప్రత్యేక సమగ్ర సవరణ (ఎస్ఐఆర్) ప్రక్రియను జిల్లా కలెక్టర్ బి. సత్యప్రసాద్ పరిశీలించారు. ఈ సందర్భంగా ఎస్ఐఆర్ ప్రక్రియ పురోగతి గురించి సంబంధిత అధికారులను అడిగి తెలుసుకున్నారు. ఎస్ఐఆర్ ఫారాల్లో నమోదైన వివరాల్లో తప్పులను ఎలా సరిచేస్తున్నారు, ఇప్పటివరకు ఎంతమంది ఓటర్లకు నోటీసులు జారీ చేశారు, ఇంకా ఎన్ని నోటీసులు పెండింగ్లో ఉన్నాయి, ఎన్ని కేసుల్లో సవరణలు పూర్తయ్యాయి తదితర వివరాలను అధికారులను అడిగి తెలుసుకున్నారు. ఓటర్ల జాబితాలో ఇంటి పేరు, ఓటరు పేరు, ఫొటో తదితర వివరాల్లో తేడాలు ఉన్నట్లయితే వాటిని నిబంధనల ప్రకారం సరి చేయాలని అధికారులకు సూచించారు. ఓటర్ల జాబితాలో అర్హత కలిగిన వారి పేర్లు తొలగిపోకుండా తగిన జాగ్రత్తలు తీసుకోవాలని తెలిపారు. ఫొటోల్లో తప్పులు ఉంటే వాటిని సరిచేయడంతో పాటు, పేరు లేదా ఇంటి పేరులో మార్పులు అవసరమైతే సంబంధిత ఆధారాలను పరిశీలించి సవరణలు చేయాలని సూచించారు. ఎస్ఐఆర్ ప్రక్రియలో భాగంగా జారీ చేసిన నోటీసుల వివరాలను అధికారులను అడిగి తెలుసుకున్నారు. నోటీసులు జారీ చేసిన అనంతరం సంబంధిత ఓటర్లకు విచారణ (హియరింగ్) నిర్వహిస్తున్నారా, ప్రతిరోజూ ఎంతమంది విచారణకు హాజరవుతున్నారు, వారి స్పందన ఎలా ఉందనే విషయాలను అధికారులను అడిగి తెలుసుకున్నారు. విచారణకు ఓటర్లు హాజరవుతున్న తీరు, ప్రజల స్పందనపై అధికారులు వివరించారు. విచారణ ప్రక్రియ సజావుగా కొనసాగుతోందని, నోటీసులు అందుకున్న ఓటర్లు విచారణకు హాజరవుతున్నారని తెలిపారు. అనంతరం కోరుట్ల లో నిర్మిస్తున్న పట్టణ ప్రాథమిక ఆరోగ్య కేంద్రం భవన పనులను పరిశీలించి నిర్మాణ పనులను దాదాపు పూర్తయ్యాయని ప్రారంభానికి కావలసిన పనులను వేగవంతం చేసి భవనాన్ని త్వరలో ప్రారంభించి వినియోగంలోకి తీసుకురావాలని అధికారులను ఆదేశించారు. ఈ కార్యక్రమంలో కోరుట్ల ఆర్డీవో జీవాకర్ రెడ్డి, జిల్లా వైద్య అధికారి సుజాత, మున్సిపల్ కమిషనర్, తహసీల్దార్, ఎంపిడివో, వైద్యులు, సూపర్ వైజర్ లు, బి.ఎల్.వో లు మరియు తదితరులు పాల్గొన్నారు.

# మల్యాలలో విషాదం



**-కుమారుడితో కలిసి మహిళ ఆత్మహత్య**

**చురకలు విలేకరి, మల్యాల, సెప్టెంబర్ 10 :** ఆర్థిక ఇబ్బందులు, అప్పులు, చిన్న కుమారుడి అనారోగ్యంతో తీవ్ర మనస్తాపానికి గురైన ఓ మహిళ తన చిన్న కుమారుడితో కలిసి బావిలో దూకిన విషాద ఘటన మల్యాల మండలంలో చోటుచేసుకుంది. మల్యాల గ్రామానికి చెందిన గుండేటి కవిత (34) గురువారం తెల్లవారుజామున తన సోదరుడు ఆదెపు కొమురయ్యకు ఫోన్ చేసి తాను చనిపోతున్నానని, తన ఇద్దరు కుమారులను మంచిగా చూసుకోవాలని చెప్పి ఫోన్ స్విచ్ఛాఫ్ చేసింది. కుటుంబ సభ్యులు గాలించగా ఉదయం 5.30 గంటల సమయంలో ముత్యంపేట శివారులోని మారుపాక విశ్వనాథ్ బావి వద్ద కవిత చెప్పులు, మొబైల్ ఫోన్ కనిపించాయి. బావిలో పరిశీలించగా కవిత మృతదేహం కనిపించడంతో ఫైర్ సిబ్బంది సహాయంతో బయటకు తీసి జగిత్యాల ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు. కవిత చిన్న కుమారుడు శశాంక్ (7) కొంతకాలంగా అనారోగ్యంతో బాధపడుతున్నాడు. కుటుంబ ఆర్థిక ఇబ్బందులు, అప్పులు, కుమారుడి అనారోగ్యంతో మనస్తాపానికి గురైన కవిత ముందుగా చిన్న కుమారుడిని బావిలో పడేసి, అనంతరం తాను కూడా దూకి ఉండవచ్చని పోలీసులు ప్రాథమికంగా భావిస్తున్నారు. శశాంక్ మృతదేహం కోసం గజ ఈతగాళ్లతో గాలింపు కొనసాగుతోంది. మృతురాలి అన్న ఆదెపు కొమురయ్య ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్ఐ ఎస్. సందీప్ తెలిపారు. ఆర్థిక, కుటుంబ సమస్యలతో తీవ్ర ఒత్తిడికి గురైన వారు ఒంటరిగా నిర్ణయాలు తీసుకోకుండా కుటుంబ సభ్యులు, స్నేహితులు లేదా సంబంధిత అధికారులను సంప్రదించాలని, ఆత్మహత్య సమస్యలకు పరిష్కారం కాదని పోలీసులు సూచించారు.

# గణేష్ నవరాత్రి ఉత్సవాలు : భక్తి, సంస్కృతి & ఆధ్యాత్మికతకు ప్రతీక

**చురకలు విలేఖరి, కరీంనగర్, సెప్టెంబర్, 10 :** శ్రీ విఘ్నేశ్వరుడు విఘ్నాలను తొలగించే దేవుడని, జ్ఞానవిజయం, శుభారంభాలకు అధిదేవుడని & వివిధ సమయాల్లో వివిధ రకాల ద్రవ్యాలతో ఆరాధించబడతాడని, ముఖ్యంగా గణేష్ నవరాత్రి ఉత్సవాలలో ప్రత్యేక పూజలు, భజనలు, సాంస్కృతిక కార్యక్రమాలతో ఘనంగా నిర్వహించబడుతాయని పాఠశాల నిర్వాహకులు డాక్టర్ వి.వనజ నరేందర్ రెడ్డి గారు, కరీంనగర్ లోని అల్ఫోర్స్ గ్రూప్ఆఫ్ స్కూల్స్‌లో & కొత్తపల్లిలోని అల్ఫోర్స్ ఇ-టెక్నో పాఠశాలలో వినాయక చవితి పురస్కరించుకొని ముందస్తు వేడుకలకు ముఖ్య అతిథిగా హాజరై జ్యోతి ప్రజ్వలన చేసి గణనాథునికి పూజా కార్యక్రమాన్ని నిర్వహించి అట్టహాసంగా & శోభయమానంగా ప్రారంభించి మాట్లాడారు.. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ గణేష్ ప్రతిష్టాపన ఉత్సవాల ప్రారంభంలో మట్టి గణపతి విగ్రహాన్ని భక్తిశ్రద్ధలతో ప్రతిష్టించి, ప్రాణప్రతిష్ఠ, సంకల్పం, అష్టోత్తర శతనామావళి కార్యక్రమాలు నిర్వహిస్తారని వారు చెప్పారు. వివిధ పూజా కార్యక్రమాలు నవరాత్రుల్లో ప్రతిరోజూ ప్రత్యేక పూజలను నిర్వహించడం ద్వారా ఉత్సవాలకు ఆధ్యాత్మిక శోభను తీసుకురావడం జరుగుతుందని వారు తెలిపారు. ప్రధానంగా గణపతి హోమం, వివిధ రకాల ద్రవ్యాలతో అభిషేకం, పంచామృత అభిషేకం, పుష్పార్చన, కుంకుమార్చన, ప్రసాద వితరణ,




అన్నదానం చేయడం చాలా పెద్ద ఎత్తున నిర్వహించడం జరుగుతుందని వారు చెప్పారు. ప్రతిరోజూ సాయంత్రం భజన కార్యక్రమాలు నిర్వహిస్తారని చెప్పారు. గణేష్ నవరాత్రుల్లో పిల్లలు, యువత మరియు మహిళల ప్రతిభను ప్రోత్సహించే వేదికగా కూడా వాడుకుంటారని చెప్పారు సాంస్కృతిక కార్యక్రమాలు, శాస్త్రీయ నృత్యాలు, జానపద నృత్యాలు, భక్తి గీతాలు, చిన్న నాటికలు, హరికథలు, కీర్తనలు, సంగీత కార్యక్రమాలు & తదితర కార్యక్రమాలను నిర్వహిస్తారని తెలిపారు. పలువురు చిన్నారులు గణనాథుని వేషధారణలో విచ్చేసి పండుగ వాతావరణాన్ని రెట్టింపు చేశారు. ఈ కార్యక్రమంలో పాఠశాలల ప్రిన్సిపాల్స్, ఉపాధ్యాయులు విద్యార్థులు పాల్గొన్నారు.

# సాఫ్ట్‌బాల్ రాష్ట్రస్థాయి పోటీలకు చించోలి పాఠశాల విద్యార్థులు ఎంపిక




**చురకలు ప్రతినిధి, నిర్మల్, సెప్టెంబర్, 10 :** నిర్మల్ జిల్లా సారంగాపూర్ మండలం చించోలి (బి) గ్రామంలోని తెలంగాణ మైనారిటీ రెసిడెన్షియల్ స్కూల్ బాయ్స్-1 విద్యార్థులు క్రీడారంగంలో ప్రతిభ చాటారు. పాఠశాలకు చెందిన షేక్ ఫర్హాన్, మహమ్మద్ అహ్మద్ ఖాన్ సబ్‌జూనియర్ విభాగంలో రాష్ట్రస్థాయి సాఫ్ట్‌బాల్ జట్టుకు ఎంపికయ్యారు. నిర్మల్ జిల్లాలో నిర్వహించిన జిల్లా స్థాయి సాఫ్ట్‌బాల్ పోటీల్లో అత్యుత్తమ ప్రతిభ కనబరిచిన ఈ ఇద్దరు విద్యార్థులు రాష్ట్రస్థాయి పోటీలకు ఎంపికయ్యారు. మంచిర్యాల జిల్లా బెల్లంపల్లిలో నిర్వహించనున్న రాష్ట్రస్థాయి సాఫ్ట్‌బాల్ పోటీల్లో వారు పాల్గొననున్నారు. ఇద్దరు విద్యార్థులు రాష్ట్రస్థాయి జట్టుకు ఎంపిక కావడం పాఠశాలకు, ఉపాధ్యాయులకు, తల్లి దండ్రులకు గర్వకారణంగా నిలిచింది. విద్యార్థుల క్రీడా ప్రతిభను గుర్తించి, నిరంతరం ప్రోత్సహిస్తున్న ఫిజికల్ డైరెక్టర్ బి.సురేశ్, పీఈటీ ఎం.డి.అజర్ హుస్సేన్‌లను పాఠశాల వర్గాలు అభినందించాయి. ఈ సందర్భంగా పాఠశాల ప్రిన్సిపల్ వి. మహేశ్, కోఆర్డినేటర్ షాకీర్ అహ్మద్ రాష్ట్రస్థాయి పోటీలకు ఎంపికైన విద్యార్థులను అభినందించి, పోటీల్లో ఉత్తమ ప్రతిభ కనబరిచి పాఠశాలకు, జిల్లాకు మంచి పేరు తీసుకురావాలని ఆకాంక్షించారు.

# ప్రభుత్వ ఆసుపత్రి భవన నిర్మాణ పనులు వేగవంతం చేయాలి

**-నాణ్యత ప్రమాణాలతో పనులు పూర్తి చేసి ప్రజలకు అందుబాటులోకి తేవాలి**
**-కలెక్టర్ బి. సత్యప్రసాద్**



**చురకలు విలేకరి, మెట్‌పల్లి, సెప్టెంబర్ 10 :** మెట్‌పల్లి పట్టణంలో కొనసాగుతున్న ప్రభుత్వ వైద్యశాల భవన నిర్మాణ పనులతో పాటు అర్బన్ కాలనీలో నిర్మిస్తున్న పట్టణ ప్రాథమిక ఆరోగ్య కేంద్రం (యూపీహెచ్‌సీ) పనులను జిల్లా కలెక్టర్ బి. సత్యప్రసాద్ గురువారం క్షేత్రస్థాయిలో పరిశీలించారు. నిర్మాణ పనుల పురోగతిని స్వయంగా పరిశీలించిన కలెక్టర్.. పనులు జరుగుతున్న తీరును సంబంధిత అధికారులను అడిగి తెలుసుకున్నారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ నిర్మాణ పనుల్లో ఎలాంటి జాప్యానికి తావులేకుండా వేగవంతంగా పూర్తి చేయాలని అధికారులను ఆదేశించారు. ప్రజలకు మెరుగైన వైద్య సేవలు అందించేందుకు ప్రభుత్వం చేపడుతున్న ఈ భవనాలు ఎంతో కీలకమని పేర్కొన్నారు. నిర్దేశించిన గడువులోగా పనులను పూర్తి చేసి, భవనాలను త్వరితగతిన ప్రజలకు అందుబాటులోకి తీసుకురావాలని సూచించారు. నాణ్యతలో రాజీ వద్దు ప్రభుత్వ భవనాల నిర్మాణంలో నాణ్యత ప్రమాణాలను కచ్చితంగా పాటించాలని కలెక్టర్ స్పష్టం చేశారు. నాసిరకం సామగ్రిని ఎట్టి పరిస్థితుల్లోనూ వినియోగించరాదని, నిర్మాణానికి నాణ్యమైన మెటీరియల్‌నే ఉపయోగించాలని ఆదేశించారు. పనుల ప్రతి దశలోనూ సంబంధిత అధికారులు క్షేత్రస్థాయిలో పర్యవేక్షణ చేపట్టి నాణ్యతను నిర్ధారించాలని సూచించారు. ప్రజలకు మెరుగైన వైద్య సదుపాయాలు అందించే లక్ష్యంతో నిర్మిస్తున్న ఈ భవనాలను పూర్తి స్థాయిలో సిద్ధం చేసి, త్వరలోనే ప్రారంభించి వైద్య సేవలు అందించేలా చర్యలు తీసుకోవాలని కలెక్టర్ అధికారులకు దిశానిర్దేశం చేశారు. ఈ పరిశీలనలో మెట్‌పల్లి ఆర్డీవో నరసింహారావు, మున్సిపల్ కమిషనర్ శ్రీనివాస్ గౌడ్, ప్రభుత్వ ఆసుపత్రి సూపరింటెండెంట్, తహసీల్దార్ ముక్తర్ పాషా, ప్రభుత్వ వైద్యశాల సిబ్బంది, సంబంధిత శాఖల అధికారులు తదితరులు పాల్గొన్నారు.